31వ వసంతంలోకి

# చురకలు

కరీంనగర్, జగిత్యాల, పెద్దపల్లి, రాజన్న సిరిసిల్ల

శుక్రవారం 26 సెప్టెంబర్ 2025 పేజీలు : 8

## పువ్వులను పూజించడం తెలంగాణ గొప్ప సంస్కృతి

- జగిత్యాల జిల్లా ఎస్పీ అశోక్ కుమార్
- జిల్లా పోలీసు కార్యాలయ ఆవరణలో అంగరంగ వైభవంగా బతుకమ్మ సంబరాలు



**చురకలు ప్రతినిధి, జగిత్యాల, సెప్టెంబర్ 25 :** పువ్వులను పూజించడం తెలంగాణ గొప్ప సంస్కృతి అని జగిత్యాల జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ అన్నారు.తెలంగాణ సంస్కృతి, సాంప్రదాయాలకు అద్దంపట్టే బతుకమ్మ వేడుకలు జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో ఆట పాటలు, కోలాటాలతో బతుకమ్మ సంబరాలు అంబరాన్నంటాయి.ఈ వేడుకలలు జిల్లా ఎస్పీ హాజరై వేడుకలను ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ బతుకమ్మ పండుగ తెలంగాణ ఆత్మను ప్రతిబింబించే పండుగ అని, ఇలాంటి వేడుకలు సాంప్రదాయ విలువలను కాపాడటమే కాకుండా,కుటుంబ బంధాలను మరింత బలపరుస్తాయని అన్నారు. ఎక్కడైనా దేవుళ్లకు పూలు పెట్టి కొలుస్తాము,కానీ పువ్వులనే దేవతగా కొలిచే

2లో

## విశ్వవిద్యాలయాలు నాణ్యమైన విద్యను అందించాలి

- మౌలిక సదుపాయాల కల్పనకు ఈ ప్రభుత్వం ముందుంటుంది
- విద్యా ఆరోగ్య రంగాలు రాష్ట్ర ప్రభుత్వానికి రెండు కళ్ళు
- రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్



**చురకలు ప్రతినిధి కరీంనగర్ సెప్టెంబర్ 25 :** శాతవాహన విశ్వవిద్యాలయం బాలికల హాస్టల్ ప్రాంగణంలో ఆదివాసి బిడ్డల కొరకు బాలుర, బాలికల (ఎస్టీ) హాస్టల్స్ కొరకు రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిన వసతి గృహాలను రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ సంక్షేమ శాఖ మాత్యులు శ్రీ అడ్లూరి లక్ష్మణ్ కుమార్, రాష్ట్ర బీసీ, రవాణా శాఖ మాత్యులు పొన్నం ప్రభాకర్ నూతన హాస్టల్ భవన నిర్మాణం కొరకు శంకుస్థాపన చేయడం జరిగింది.ఈ సందర్భంగా లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ పేద, గ్రామీణ ప్రాంత విద్యార్థులకు హాస్టల్ వసతి కావాలని రాష్ట్రం తీసుకున్న నిర్ణయం చాలా అభినందనీయమని రాష్ట్ర ప్రభుత్వం పేద బిడ్డల కొరకు ఆదివాసి, గిరిజన బిడ్డల కొరకు ఎన్నో సంక్షేమ పథకాలు, మౌలిక సదుపాయాలను ఏర్పాటు చేస్తుందని దానిలో భాగంగా 20 కోట్ల విలువైన రెండు హాస్టల్ భవనాలను చెరొక పదికోట్లతో నిర్మించడానికి ఆర్థిక సహాయం చేసిందని దీనితో విశ్వవిద్యాలయాలలో ఆదివాసీ, గిరిజన బిడ్డలకు హాస్టల్ సౌకర్యాలు సమకూరుతాయని ఉన్నత విద్యను నేర్చుకోవడం కొరకు విద్యార్థులు ముందుకు రావాలని పిలుపునిచ్చారు.రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ తెలంగాణ ప్రజా పాలన నాయకత్వంలో ఎన్నో మంచి మార్పులు వచ్చాయని దాన్లో భాగంగా హుస్నాబాద్ లో ఇంజనీరింగ్ కళాశాల, కరీంనగర్ లో ఎల్.ఎల్.బి, ఎల్ఎల్ఎం, ఫార్మసీ కోర్సులు తీసుకురావడం చాలా అభినందదాయకమని ఈ జిల్లాకు విద్య, వైద్య సౌకర్యాలకై ప్రత్యేక శ్రద్ధ పెడుతున్నామని కాంగ్రెస్ హయాంలో ఎన్నో అభివృద్ధి కరమైన పనులు జరిగాయని ప్రజల ఆకాంక్ష కోసము విద్య సంక్షేమ కార్యక్రమాలు ఎలాంటి ఆటంకాలు లేకుండా ముందుకు సాగిపోవటానికి రాష్ట్ర ఖజానాలో సరిపోయే డబ్బులు లేనప్పటికీ మంత్రిమండలి సమిష్టిగా పనిచేస్తూ రాష్ట్ర అభివృద్ధికి కట్టుబడి ఉన్నామన్నారు. అంతేకాకుండా విశ్వవిద్యాలయము కూడా యుజిసి గ్రేడింగ్, నాక్, ఏ ఐ సి టి ఈ మార్గదర్శకాలను అనుసరించి నాణ్యమైన విద్యను అందించడానికి అధ్యాపకులు కష్టపడాలని విద్యార్థులు ఉన్నత శిఖరాలు అధిరోహించడానికి తోడ్పడాలని కోరుతూ ప్రభుత్వ నిబంధనల ప్రకారము విద్యను ముందుకు తీసుకెళ్లాలని గ్రామీణ ప్రాంత తల్లిదండ్రులు ఎన్నో ఆశలతో తమ పిల్లల్ని విశ్వవిద్యాలయాలకు పంపుతున్నారని

2లో

## ప్రతి పేదవారికి సొంతిల్లు నిర్మిస్తాం

- నియోజకవర్గంలో 3500 ఇందిరమ గృహాలు మంజూరి
- చిన్నారులకు పోషకాహార విలువ గల ఆహారం అందజేయాలి
- రాష్ట్ర మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు



**చురకలు ప్రతినిధి కమాన్ పూర్ (కాటారం) సెప్టెంబర్ 25 :** పేద వాని సొంతింటి కల నెరవేర్చడమే లక్ష్యంగా ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం చేపట్టినట్లు రాష్ట్ర, ఐటి పరిశ్రమలు, శాసనసభా వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అన్నారు.గురువారం కాటారం మండల కేంద్రంలోని బిఎల్ఎం గార్డెన్స్ లో గృహ నిర్మాణ శాఖ ఆధ్వర్యంలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలు,మహిళ శిశు సంక్షేమ శాఖ అధ్వర్యంలో ఏర్పాటు చేసిన పోషణమాసం కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తో కలిసి మంత్రి శ్రీధర్ బాబు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా అంగన్వాడి సిబ్బంది ఏర్పాటు చేసిన పౌష్టికాహార స్టాళ్లను

2లో

## స్వదేశీ వస్తువులను కొనుగోలు చేయండి

- దేశాభివృద్ధికి పాటుపడండి
- ప్రజలకు కేంద్ర మంత్రి బండి సంజయ్ పిలుపు



**చురకలు ప్రతినిధి కరీంనగర్ సెప్టెంబర్ 25 :** స్వదేశీ వస్తువులనే వాడాలని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ పిలుపునిచ్చారు. మన దేశంలో తయారు చేసిన వస్తువులు కొనుగోలు చేయడం ద్వారా స్థానిక కంపెనీలు, చిన్నతరహా వ్యాపారాలు బలపడతాయని,ఉద్యోగావకాశాలు పెరుగుతాయని తెలిపారు. స్థానిక ఆర్థిక వ్యవస్థ బలోపేతమవుతుందని, డబ్బు దేశంలోనే చలామణి అవుతుందని పేర్కొన్నారు.స్వయం సమృద్ధి చెందిన దేశంగా (ఆత్మ నిర్భర భారత్) అభివృద్ధి చేసేందుకు ప్రధానమంత్రి నరేంద్రమోదీ చేపడుతున్న కార్యక్రమాలకు ప్రతి ఒక్కరూ సంపూర్ణ మద్దతివ్వాలని కోరారు.జీఎస్టీ సంస్కరణల ఫలితంగా 'స్వరాజ్ సంస్థ' ట్రాక్టర్ ధర రూ.40 వేల నుండి రూ.80 వేల వరకు తగ్గిన నేపథ్యంలో పలువురు రైతులు వాటిని కొనుగోలు చేశారు. స్వరాజ్ ట్రాక్టర్స్ డీలర్స్ అసోసియేషన్ నాయకులు ఆయా ట్రాక్టర్లను కేంద్ర మంత్రి చేతుల మీదుగా రైతులకు అందజేశారు. ఈ సందర్భంగా బండి సంజయ్ ఆయా రైతులతో, డీలర్స్ తో మాట్లాడి ఒక్కో ట్రాక్టర్ పై ఎంత ధర తగ్గిందని ఆరా తీశారు. జీఎస్టీ సంస్కరణలవల్ల తాను కొన్న ట్రాక్టర్ ధర రూ.10 లక్షల 50 వేలు ఉండగా, ప్రస్తుతం రూ. 9 లక్షల 80 వేలకే వచ్చిందని తద్వారా రూ.70 వేలు ఆదా అయ్యాయని మక్కపల్లికి చెందిన రైతు అఖిల్ చెప్పారు. మానకొండూరు మండలం లింగాపూర్ కు చెందిన అనిల్‌కుమార్ అనే రైతు మాట్లాడుతూ జీఎస్టీవల్ల తనకురూ. 50 వేలు ఆదా అయ్యిందన్నారు. నుస్తులాపూర్‌కు చెందిన

2లో

## పోలీస్ కమీషనరేట్‌కు నూతన లోగో ఆవిష్కరణ




**చురకలు,క్రైమ్ ప్రతినిధి,కరీంనగర్, సెప్టెంబర్ 25 :** కరీంనగర్ పోలీస్ కమీషనర్ గౌష్ ఆలం కరీంనగర్ పోలీస్ కమీషనరేట్ కేంద్రంలో గురువారం నెలవారీ నేర సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు.ఈ సమావేశంలో సిపి కరీంనగర్ పోలీస్ కమీషనరేట్‌కు ప్రత్యేకంగా రూపొందించిన నూతన లోగోను అధికారికంగా ఆవిష్కరించారు. ఈ లోగోను ఇకపై రాష్ట్ర పోలీసు లోగోతో పాటు పోలీసుల యూనిఫామ్‌పై ధరించవచ్చని కమీషనర్ తెలిపారు. హైదరాబాద్, సైబరాబాద్, రాచకొండ తర్వాత సొంత లోగోను కలిగి ఉన్న నాలుగో కమీషనరేట్‌గా కరీంనగర్ నిలిచిందని ఆయన పేర్కొన్నారు. అనంతరం, సమావేశంలో పాల్గొన్న అధికారులకు కమీషనర్ గౌష్ ఆలం పలు కీలక సూచనలు చేశారు.పిటిషన్ మేనేజ్‌మెంట్ సిస్టమ్‌ను సమర్థవంతంగా అమలు చేసి,ప్రజల ఫిర్యాదులను త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు.సర్కిల్ ఇన్‌స్పెక్టర్లు తమ పరిధిలోని పోలీస్ స్టేషన్లను తరచూ సందర్శించి సిబ్బంది పనితీరును పర్యవేక్షించాలన్నారు.ఎస్.హెచ్.ఓ.లు పోలీస్ స్టేషన్లను, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచి,రికార్డులను సక్రమంగా నిర్వహించాలని సూచించారు. పెండింగ్ లో ఉన్న కేసులను త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. డివిజన్‌ను సెక్టార్లు, సబ్-సెక్టార్లుగా విభజించి, ప్రతి సెక్టార్‌కి ఒక ఇన్‌ఛార్జ్‌ని నియమించడం ద్వారా ప్రజలకు మెరుగైన సేవలు అందించవచ్చని తెలిపారు.రౌడీ షీటర్లు, హిస్టరీ షీటర్ల కదలికలపై నిఘా ఉంచాలని, మాదక ద్రవ్యాలు,అక్రమ ఇసుక రవాణా, పీ.డీ.ఎస్.బియ్యం అక్రమ రవాణా, పేకాట స్థావరాలపై కఠిన చర్యలు తీసుకోవాలని హెచ్చరించారు.గంజాయి నిర్మూలన కోసం పాఠశాలలు, కళాశాలల్లో 'యాంటీ డ్రగ్ కమిటీలను' ఏర్పాటు చేసి అవగాహన కల్పించాలని సూచించారు.పెరుగుతున్న సైబర్ నేరాలపై ప్రజల్లో అవగాహన పెంచాలని ఆదేశించారు. రోడ్డు ప్రమాదాలను

2లో

## రైతులు తమ అభిప్రాయాలను వెల్లడించాలి



**చురకలు విలేకరి,మెట్ పల్లి, సెప్టెంబర్ 25 :** ముత్యంపేటలోని నిజాం దక్కన్ సుగర్ ఫ్యాక్టరీ పునఃప్రారంభానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని షుగర్ ఫ్యాక్టరీ ఉద్యమకారుడు గోరుమంతుల ప్రవీణ్ కుమార్ తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ శుక్రవారం మెట్పల్లి మండలంలోని వేంపేట ఎస్విఎస్ ఫంక్షన్‌హాల్‌లో షుగర్ ఫ్యాక్టరీ పునరుద్ధరణకు ప్రజాభిప్రాయ సమావేశాన్ని నిర్వహిస్తున్నారని, ఈ సమావేశానికి మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, పరిశ్రమల శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ, వ్యవసాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ, జిల్లా కలెక్టర్ బి.సత్యప్రసాద్లు హాజరవుతారన్నారు. రైతులు ఈ సమావేశానికి హాజరై తమ అభిప్రాయాలను పార్టీలకు అతీతంగా తెలియజేయాలని కోరారు.

## యాదవ సంఘ కోసం స్థలం కేటాయించాలి



**చురకలు విలేకరి,జగిత్యాల, సెప్టెంబర్ 25 :** జగిత్యాల జిల్లా యాదవ యువజన సంఘం సభ్యులు జగిత్యాల ఎమ్మెల్యే డా.సంజయ్ కుమార్‌ను గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారు జిల్లా కేంద్రంలో యాదవ యువజన సంఘం భవననిర్మాణం కోసం స్థలం కేటాయిం చాలని వినతిపత్రాన్ని అందజేశారు.సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే జిల్లా యాదవ యువజన సంఘం భవన నిర్మాణానికి అధికారుల దృష్టికి విషయాన్ని తీసు కెళ్లి స్థలం కేటాయించడానికి చొరవ తీసుకుంటానని హామీ ఇచ్చారు.

## స్వదేశీ వస్తువులను కొనుగోలు చేయండి

**మొదటి పేజీ తరువాయి...** వెంకటేశ్ యాదవ్ మాట్లాడుతూ తాను ట్రాక్టర్ కొనడంవల్ల రూ.50 వేలు ఆదా అయ్యిందన్నారు. స్వరాజ్ ట్రాక్టర్ డీలర్ వెంకట్ మాట్లాడుతూ జీఎస్టీ తగ్గింపుతో స్వరాజ్ కు చెందిన వివిధ రకాల ట్రాక్టర్లు ఒక్కో దానిపై సగటున రూ.40 నుండి రూ.80 వేలదాకా తగ్గింపు జరిగిందన్నారు. తద్వారా ట్రాక్టర్స్ సేల్స్ బాగా పెరిగాయని, రైతులు కూడా చాలా సంతోషంగా ఉన్నారని తెలిపారు.ఈ సందర్భంగా వారంతా కేంద్ర ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపారు.ఈ సందర్భంగా బండి సంజయ్ మాట్లాడుతూ జీఎస్టీవల్ల కలుగుతున్న ప్రయోజనాలను మీ చుట్టుపక్కలనున్న వారందరికీ వివరించాలని కోరారు.

## పోలీస్ కమీషనరేట్‌కు నూతన లోగో ఆవిష్కరణ

**మొదటి పేజీ తరువాయి...**నివారించడానికి బ్లాక్ స్పాట్స్‌ను గుర్తించి తగు చర్యలు తీసుకోవాలని, హైదరాబాద్‌లో అమలు చేస్తున్న ట్రాఫిక్ నివారణ చర్యలను అనుసరించాలని సూచించారు. కమ్యూనిటీ పోలీసింగ్‌లో భాగంగా సీసీ కెమెరాల ఏర్పాటుకు ప్రజలను ప్రోత్సహించాలన్నారు.ఈ సమావేశంలో అడిషనల్ డీసీపీలు వెంకటరమణ (పరిపాలన), భీంరావు (ఏ.ఆర్.), పలువురు ఏసీపీలు, ఇన్‌స్పెక్టర్లు, ఇతర పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

## పువ్వులను పూజించడం తెలంగాణ గొప్ప సంస్కృతి



**మొదటి పేజీ తరువాయి...**సాంప్రదాయం ఒక తెలంగాణ లో మాత్రమే ఉందన్నారు. తెలంగాణ సంస్కృతికి చారిత్రక చిహ్నం బతకమ్మని, తెలంగాణ సంస్కృతికి అద్దం పట్టే బతుకమ్మ వేడుకలు ప్రపంచవ్యాప్తంగా ప్రాచుర్యం పొందుతున్నాయని తెలిపారు. పోలీసు వారి కుటుంబ సభ్యులతో బతుకమ్మ ఆడటం ఇంత మంది కుటుంబ సభ్యులను కలిసినందుకు వారితో బతుకమ్మ సంబరాల్లో పాల్గొన్నందుకు ఆనందంగా ఉందన్నారు. ఈ సందర్భంగా ఎస్పీ పోలీసు సిబ్బంది,వారి కుటుంబ సభ్యులతో కలిసి బతుకమ్మ ఆడుతూ సాంప్రదాయ ఉత్సాహాన్ని పంచుకున్నారు. మహిళా పోలీస్ సిబ్బంది అందరూ రంగురంగుల చీరలతో బతుకమ్మలను అలంకరించి పాటలు పాడుతూ ఆనందోత్సాహాలతో వేడుకను జరిపారు. అందంగా, సాంప్రదాయ శైలిలో బతుకమ్మలను రూపొందించిన వారికి ప్రత్యేక బహుమతులను ప్రదానం చేసి సత్కరించారు. ఈ కార్యక్రమంలో డిఎస్పీ లు వెంకటరమణ ,రఘు చందర్, రాములు, ఏవో శశికళ, ఇన్స్పెక్టర్లు , ఆర్ఐ లు కిరణ్ కుమార్, వేణు, సైదులు, ఎస్ఐలు, మహిళా సిబ్బంది పాల్గొన్నారు.

# విశ్వవిద్యాలయాలు నాణ్యమైన విద్యను అందించాలి

**మొదటి పేజీ తరువాయి...**వారి ఆశలను సజీవంగా నిలిపి దేశ విదేశాలలో శాతవాహన పేరు విద్యా ప్రమాణాలు విషయంలో ప్రథమంగా నిలిచేందుకు ప్రయత్నం చేయాలని ఆశిస్తున్నామన్నారు.భవిష్యత్తు తెలంగాణను అభివృద్ధి దిశలో తీసుకెళ్లి పిల్లల భవిష్యత్తును తీర్చిదిద్దాలని ఆకాంక్షిస్తున్నామన్నారు.విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య ఉమేష్ కుమార్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యా సౌకర్యాల పట్ల మౌలిక నిర్మాణాల పట్ల చాలా చొరవ చూపిస్తుందని ప్రభుత్వ ఆదేశాల మేరకు తల్లిదండ్రుల ఆశయాలకు అనుగుణంగా పాలకవర్గ సహకారంతో నాణ్యమైన విద్యను అందించడానికి విశ్వవిద్యాలయాన్ని అన్ని రంగాలలో ముందు నిలిపి లక్ష్యసాధన కొరకు కృషి చేస్తామన్నారు. జిల్లా కలెక్టర్ శ్రీమతి పమేల సత్పతి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వము ఎన్నో ఉపాధి అవకాశాలను ప్రజల కొరకు ఏర్పాటు చేస్తుందని, నాణ్యమైన ఉన్నత విద్యతోనే విద్యార్థులు మంచి ఉద్యోగాలు సంపాదించుకుంటారని విశ్వవిద్యాలయాలలో మౌలిక సదుపాయాలు సరిగ్గా ఉంటేనే నాణ్యమైన విద్య కూడా విద్యార్థులకు అందుతుందని ఈ రాష్ట్ర ప్రభుత్వం ముఖ్యంగా పేదవారికి మంచి విద్య అందించేందుకు నడుము కట్టిందని విద్యార్థులు దీనిని సద్వినియోగం చేసుకోవాలని భవిష్యత్తుకు బంగారు బాటలు వేసుకోవాలన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ అశ్వినీ తానాజీ, మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్, సుడా చైర్మన్ నరేందర్ రెడ్డి ట్రైబల్ వెల్ఫేర్ ఆఫీసర్లు, జిల్లా అధికారులు, ఆర్ టి ఐ అధికారి, విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ ర్ ఆచార్య జాస్తి రవికుమార్, ఓ ఎస్ డి టు విసి డాక్టర్ బి హరి కాంత్, సైన్స్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్ రమాకాంత్, ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపల్ ఆచార్య సుజాత, విశ్వవిద్యాలయ చీఫ్ వార్డెన్ డాక్టర్ మనోహర్ వివిధ విభాగాల అధిపతులు అధ్యాపకులు బోధనేతర సిబ్బంది విద్యార్థి విద్యార్థులు పాల్గొన్నారు.

# ప్రతి పేదవారికి సొంతిల్లు నిర్మిస్తాం

**మొదటి పేజీ తరువాయి...** పరిశీలించి వారు తయారు చేసిన వంటకాలను రుచి చూశారు.అనంతరం అర్హులైన 300 మంది ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు మంజూరు పత్రాలను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ బాలింతలకు, చిన్న పిల్లలకు పౌష్టికాహారం అందించడం లక్ష్యంగా పోషణ మాసం కార్యక్రమ చేపట్టడం జరిగిందన్నారు.మరొకటి పేద వాడి సొంతింటి కల నెరవేర్చడం కోసం సీఎం రేవంత్ రెడ్డి ఇందిరమ్మ ఇళ్ల పథకం తీసుకుకు వచ్చి అర్హులైన లబ్ధిదారులకు నేడు మంజూరు పత్రాలు అందించడం జరుగుతుందన్నారు.ఇల్లు లేని నిరుపేద కుటుంబాలకు, గ్రామాలలో ఇందిరమ్మ ఇళ్ల కమిటీల ద్వారా లబ్ధిదారులను ఎంపిక చేయడం జరిగిందని, అట్టి జాబితా ను గెజిటెడ్ అధికారులతో విచారణ నిర్వహించి నిరుపేదలను ఎంపిక చేసినట్లు తెలిపారు. నియోజక వర్గం వ్యాప్తంగా 3500 ఇళ్ళు మంజూరు అయ్యాయని తెలిపారు.ప్రతి సంవత్సరం 3500 ఇళు ్ళ మంజూరు చేసి నిరుపేదలకు మొదటి ప్రాధాన్యత కల్పిస్తున్నామని తెలిపారు. గతంలో ఇల్లు నిర్మాణం చేపట్టని లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్లు అందించే విధంగా చర్యలు తీసుకోబోతున్నామని అన్నారు. గత ప్రభుత్వం హయాంలో ఒక్క ఇల్లు అందించలేదని తెలిపారు. మంజూరు అయిన ఇళ్లకు 5 లక్షలతో నిర్మాణము జరుగుతుందని,4 విడతలుగా నిధులు విడుదల చేస్తున్నామని తెలిపారు. ప్రతి సోమ వారం లబ్ధిదారుల అకౌంట్లో జమ చేయడం జరుగుతుందని తెలిపారు. నిర్మాణానికి ఆర్థిక ఇబ్బందులు రాకుండా మహిళా సంఘాలు ద్వారా రుణ సదుపాయం కల్పిస్తున్నామని తెలిపారు.400 నుండి 599 ఎస్ ఎఫ్ ట్ఫీ వరకు ఇంటి నిర్మాణం చేపట్టాలని తెలిపారు. అంతకు మించి సైజు పెరిగితే బిల్లులు విడుదల కావని స్పష్టం చేశారు. ఇందిరమ్మ ఇళ్లు నిర్మాణం కోసం ఉచితంగా ఇసుకను అందించడం జరుగుతుందని అన్నారు. అలాగే సిమెంట్ కూడా తక్కువ దరకు అందించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. అర్హులైన పేద కుటుంబాలకు ఉచిత విద్యుత్, మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం, మహిళలకు 20వేల కోట్ల రూపాయలు వడ్డీ లేని రుణాలు అందించామని తెలిపారు. రైతు ఋుణ మాఫీ, విద్యార్థులకు డైట్, కాస్మొటిక్ ఛార్జీలు పెంచామని తెలిపారు. పెద్ద ఎత్తున సంక్షేమ కార్యక్రమాలు నేడు ప్రభుత్వం అమలు చేస్తుందని అన్నారు.ఒక ఇల్లు నిర్మిస్తే ఒక కుటుంబాన్ని నిలబెట్టిన వాళ్లుగా నిలిచిపోతామని తెలిపారు. పేదోళ్లకు ఇబ్బందులు కలిగించే పనులు చేయొద్దని మారుమూల ప్రాంత ప్రజలకు సేవ చేయడానికి వచ్చారు సేవలు చేయాలని ప్రజలను మన్ననలు పొందాలని తెలిపారు. నిర్మాణంలో జాప్యం లేకుండా ఎంపీడీవోలు గృహ నిర్మాణ శాఖ అధికారులు పర్యవేక్షణ చేయాలని, ఇల్లు నిర్మాణం ఆగిపోతే ఎంపీడీవోలు గృహ నిర్మాణ శాఖ అధికారుల వేతనాల నుంచి కోత విధిస్తానని మంత్రి స్పష్టం చేశారు. ప్రభుత్వ పథకాల అమలులో ప్రభుత్వ అధికారులు గానీ ఇతరులు ఎవరైనా లబ్ధిదారులను డబ్బులు అడిగితే పోలీస్ కేసు నమోదు చేయాలని సూచించారు. మీ ఆశలను నెరవేర్చాలని లక్ష్యంతో ప్రభుత్వం ఇందిర ఇల్లు మంజూరు చేసిందని మంజూరైన ప్రతి లబ్ధిదారులు ఇల్లు కట్టుకోవాలని సూచించారు. ర ఇల్లు నిర్మాణంతో సంతోషంగా ఉండాలని, మనం మనం గుర్తుకు రావాలని ఆయన సూచించారుజిల్లా కలెక్టర్ మాట్లాడుతూ..నిజమైన లబ్ధిదారులను ఎంపిక చేయడం జరిగిందని తెలిపారు. గెజిటెడ్ అధికారులతో విచారణ జరిపి పారదర్శకంగా అర్హులను ఎంపిక చేశామని తెలిపారు.AI ద్వారా కూడా విచారణ చేపట్టామని తెలిపారు. లబ్ధిదారులు ఫోటో దిగిన చోట మాత్రమే ఇళ్లు నిర్మాణం చేపట్టాలని,4 విడతలుగా లబ్ధిదారులకు డబ్బు జమ చేయడం జరుగుతుందన్నారు. లబ్ధిదారులు త్వరిత గతిన ఇళ్ల నిర్మాణాలు చేపట్టాలని, ఇబ్బంది ఉన్న లబ్ధిదారులకు మహిళా సంఘాలు ద్వారా రుణ సదుపాయం కల్పిస్తున్నామని తెలిపారు.అనంతరం చిన్నారులకు అక్షరాభ్యాసం, గర్భిణీ లకు సీమంతం, కళ్యాణ్ లక్ష్మి, సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను అందజేశారు.ఈ కార్యక్రమాల్లో ట్రేడ్ ప్రమోషన్ చైర్మన్ ఐతా ప్రకాష్ రెడ్డి, ఉపాధిహామీ పథకం రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు దండు రమేష్, గ్రంధాలయ సంస్థ చైర్మన్ రాజబాబు, మార్కెట్ కమిటీ చైర్మన్ తిరుమల సమ్మయ్య,సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్,స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విజయలక్ష్మి,గృహ నిర్మాణ శాఖ పిడి లోకిలాల్, మహిళా, శిశు సంక్షేమ అధికారిణి మల్లీశ్వరి, మిషన్ భగీరథ ఈఈ శ్వేతా, మహాదేవపూర్ సింగిల్ విండో చైర్మన్ తిరుపతి రెడ్డి, సీడీపీఓ రాధిక తదితరులు పాల్గొన్నారు.

# "కడారి"కి కన్నీటి వీడ్కోలు..

- ◆గోపాల్ రావు పల్లెలో విషాదఛాయలు
- ◆నివాళులు అర్పించిన ప్రజాసంఘాల నాయకులు



**చురకలు ప్రతినిధి, సిరిసిల్ల .సెప్టెంబర్ 25 :** మావోయిస్టు పార్టీ సెంట్రల్ కమిటీ సభ్యులు కడారి సత్యనారాయణ రెడ్డి మరణంతో రాజన్న సిరిసిల్ల జిల్లా తంగళ్ళపల్లి మండలం గోపాలరావు పల్లెలో విషాద ఛాయలు అలుముకున్నాయి.కడారి సత్యనారా యణ రెడ్డి మృతదేహం గురువారం స్వగ్రామం చేరింది.పలు పార్టీల, ప్రజాసంఘాలు నాయకులు కడారి స్వగ్రామంలో గురువారం నివాళులు అర్పించారు.ప్రజా సంఘాల నాయకులు గాదె ఇన్నయ్య, విరసం కార్యదర్శి పాణి, అమరవీరుల బంధుమిత్రుల కమిటీ నాయకురాలు పద్మతో పాటు సిపిఐ, బిఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలకు చెందిన నాయకులు సత్యనారాయణ రెడ్డి కి నివాళులు అర్పించి ఆయన ప్రజల కోసం చేసిన త్యాగాన్ని కొనియాడారు. ప్రజా కళామండలి కళాకారుల విప్లవ పాటలు గోపాల్ రావు పల్లెలో మారుమోగాయి. ఈ సందర్భంగా గాదే ఇన్నయ్య తో పాటు పౌర హక్కుల సంఘం నాయకులు మాట్లాడుతూ కేంద్రంలోని మోడీ ప్రభుత్వం చేసిన హత్యాకాండ అని బూటకపు ఎన్కౌంటర్ లో సత్యనారాయణ రెడ్డిని చిత్రహింసలు చేసి కాల్చి చంపారని ఆరోపించారు. ముమ్మాటికి ఇది ప్రభుత్వం చేసిన హత్య అన్నారు. అంచలంచెలుగా ప్రజా పోరాటాలలో నాలుగు దశాబ్దాలుగా ప్రజా ఉద్యమాలలో పనిచేస్తూ మావోయిస్టు కేంద్ర పార్టీ స్థాయికి ఎదిగారని అన్నారు. ద్రోహుల సమాచారంతో కామ్రేడ్ కడారి సత్యనారాయణరెడ్డి తోపాటు మరో కేంద్ర కమిటీ సభ్యులు రాజు ను చత్తీస్గడ్ నారాయణపూర్ జిల్లా అబూజ్ మడ్ సరిహద్దుల్లో బూటకపు ఎన్కౌంటర్ లో కాల్చి చంపారని ఆరోపించారు. విప్లవ అభిమను లు కడసారి కన్నీళ్ళతో జోహార్లు అర్పించారు.ప్రజా కళామండలి కళాకారులు విప్లవ గీతాలు ఆలాపించి కడారి కి జోహార్లు అర్పించారు. కార్యక్రమంలో భారత్ బచావో జాతీయ అధ్యక్షులు, ఇన్నయ్య, విరసం నాయకులు పాణి, అమరవీరుల బంధువిత్రుల కమిటీ నాయకురాలు పద్మ కుమారి భారీ సంఖ్య లో విప్లవ అభిమానులు పాల్గొన్నారు.

# ఆకట్టుకున్న శాకాంబరి అలంకరణలు

**రామ కిష్టయ్య సంగన భట్ల...**

ధర్మపురి క్షేత్రస్థ శ్రీరామలిం గేశ్వర ఆలయంలో నిర్వహిస్తున్న శరన్నవరాత్రి ఉత్సవ వేడుకలలో భాగంగా కూష్మాండ రూపిణియైన శ్రీశారదామాతకు గురు వారం చేసిన శాకాంబరి అలంకరణలు విశేషంగా ఆకట్టుకున్నాయి.

**శాకాంబరి ప్రత్యేకతలు**

పూర్వకాలంలో భూ లోకంలో అనావృష్టి సంభవించి, ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురైన నేపథ్యంలో, మునీశ్వరు లంతా జగన్మాతను స్తుతించి, ఆకలి దప్పులతో అలరారు తున్న ప్రజలను కాపాడాలని ప్రార్థించారు. అప్పుడు ఆది దేవత కరుణించి 'శతాక్షీదేవి'గా ప్రజలచే కొలువ బడుదునని, తన దేహం నుండి అనేక విధములైన శాకములు ఉద్భవించి, సకాల వర్షాలు కురిసి, పాడి పంటలు సమృద్ధిగా కలిగి,



భూతలం సస్యశ్యామలమై సుభిక్షంగా మారి భూలోకంలో ప్రజలు సుఖ శాంతులతో వర్ధిల్లగల రని అభయ మిచ్చినట్లు పురాణ కథనాలు. అప్పటి నుండి శరన్నవ రాత్రి ఉత్సవాలలో భాగంగా అమ్మవారిని శాకాంబరీ మాతగా అలంకరించి పూజించడం ఆచారంగా వస్తున్నది. శ్రీశాకాంబరీతి పాఖ్యానంలో తదాయ స్యాంమేహం భువి అని చండీపాఠంలో వర్ణించిన రీతిలో బెండ, ఆలు, టమాటా, దొండ ఆదిగా కూరగాయలతో మాతను గురు వారం మాలాలంకృత గావించారు. దేవస్థానం ఏ సీ ఈ ఓ శ్రీనివాస్ మార్గదర్శకత్వంలో, జక్కు రవీందర్ నేతృత్వం లోని ధర్మ కర్తలు, సూపరింటెం డెంట్ కిరణ్, సీ. అ. శ్రీనివాస్ ఆధ్వర్యంలో, ఆస్థాన వేదపండితులు బొజ్జా రమేశ్ శర్మ, ముత్యాల శర్మ, పాలెపు ప్రవీణ్ శర్మ నేతృత్వంలో, పాలెపు సందీప్ శర్మ, నంబి అరుణ్, అర్చకులు దేవళ్ళ విశ్వనాథ శర్మ, సాయి, నారాయణ, భరత్ , బలరాం , చంద్ర మౌళి,తదితరులు చతుష్షష్ఠి పూజలు, కన్యకా సువాసిని పూజాది ప్రత్యేక అర్చనలు చేశారు. ఈ కార్యక్రమంలో సంప్రదాయాచరణాసక్తులైన భక్తులు పాల్గొన్నారు. అలాగే శ్రీనర్మదేశ్వర మందిరంలో ప్రతిష్ఠిత దుర్గామాతకు వేద విదులైన మధు శంకర్ శర్మ, పాలెపు చంద్రమౌళి శర్మలచే చండీ పారాయణం, చతుష్షష్ఠి పూజలు నిర్వహించగా, అశేష భక్తజనం పాల్గొ న్నారు. టిటిడి కల్యాణ మంటపంలో వంశీకృష్ణ, ప్రశాంత్, బల్యపెల్లి, మహా శక్తి సేవా సమితి ఆధ్వర్యంలో వంశీ కృష్ణ, నటరాజ్ పెండ్యాల రాజేశ్ ప్రత్యేక పూజలు నిర్వహించారు.తిమ్మాపూర్ గ్రామంలోనూ శ్రీసీతారామాలయంలో శరన్నవరాత్రి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. దుర్గ గాయత్రి శివాలయంలో సీతారామశర్మ, వాసవి కన్యకా పరమేశ్వరీ ఆలయంలో బొర్ర శంకర్ ఆధ్వర్యంలో చతుష్షష్ఠి పూజలు గావించారు.

# వార్షిక శుక్రవారోత్సవానికి ఏర్పాట్లు

## -భక్తుల భాగస్వామ్యంతో ప్రత్యేక పూజలు

**రామ కిష్టయ్య సంగన భట్ల...**

వైవిధ్యాలు గల పలు దేవాల యాల సముదాయంతో వెలుగొందు తున్న ప్రాచీన సుప్ర సిద్ధ గోదావరీతీరస్థ తీర్థమైన ధర్మపురి క్షేత్రంలో దసరా ఉత్సవాల సందర్భంగా ఏడాదిపాటు నిర్వహించే వార్షిక శుక్రవారోత్సవాన్ని సెప్టెంబర్ 26వతేదీ నుండి దేవస్థానం ఆధ్వర్యంలో ప్రారంభిస్తున్నారు. శ్రీమహా విష్ణువు దుష్టశి క్షణ, శిష్టరక్షణకై ఎత్తిన ప్రతి అవతారం లోనూ శ్రీహరి వెంట శ్రీదేవి ఆదర్శ సతిగా అవతారాలు దాల్చింది. అందుకే శ్రీమహా విష్ణువు తన వక్షస్థలంలో శ్రీదేవికి శాశ్వత నివాస స్థానాన్ని కల్పించి ఇతోధిక ప్రేమాభిమానాలను చాటి చెప్పారు. క్షీరోద సంభవాం... పాలస ముద్రంలో జన్మించిన లక్ష్మీదేవి ప్రీతిపాత్రుడై క్షీరాబ్ధిపై శయనించిన వైకుంఠ వాసునికి లక్ష్మీదేవి జన్మస్థానమైన క్షీరమంటే అత్యంత ఇష్టము. అందుకే మహావిష్ణువు క్షీరాభిషేకానికి సంతుష్టుడై, సకల కోర్కెలు నెరవేరుస్తాడని ప్రతీతి.



కృతేతు నారసింహోభూత్ త్రేతాయం రఘునందన... ద్వాపరే వాసుదేవశ్చ కలౌ వేంకట నాయకః కృతయుగంలో శ్రీనృ సింహునిగా,త్రేతాయుగంలో శ్రీరామునిగా,ద్వాపరయు గంలో శ్రీకృష్ణునిగా,కలియుగంలో శ్రీవేంకటనాయకునిగా అవతరించాడు శ్రీమహావిష్ణువు,శ్రీయాధ్యస్థితవక్షసం... లక్ష్మీదేవి నివాస స్థానమైన వక్షము గల శ్రీవేంకటేశ్వరునికి,భృగువారే హరే: ప్రియం...లక్ష్మీవారమైన శుక్రవారం నాడు క్షీరాభిషేకం సర్వ శ్రేష్ఠం మరియు స్వామి వారికి ప్రీతి పాత్రము. తనకిష్టమైన దానిని సమర్పించే వారికి ఇష్టమైనవి ఇచ్చే వరదుడు అయిన శ్రీవేంకటేశ్వరుని శుక్రవారోత్సవ సందర్భంగా నిర్వహించే క్షీరాభిషేకం విశేష ప్రాధాన్యతను సంతరించు కున్నది.గ్రహదోష, గృహదోష,సర్వబాధ నివారణకు,సర్వాభీష్ట సిద్ధికి, ఆయురా రోగ్య, ఐశ్వర్య, వ్యాపారాభివృద్ధికై ధర్మపురి క్షేత్రంలోని దేవస్థానంలో గల ప్రధానాలయమైన శ్రీవేంకటేశ్వర స్వామి దేవాలయంలో కలియుగ దైవానికి వార్షిక శుక్రవారోత్సవం 26వ తేదీ శు క్రవారం నాడు ప్రారంభం కానుంది. ఆరోజు మొదలుకొని సంవత్సర కాలం పాటు ప్రతి శుక్రవారం క్షీరాభిషేకం, కుంకుమార్చన,మూల మంత్ర జపము, సహస్ర నామార్చనతో పాటు,వ్యాపారా భివృద్ధికై ప్రత్యేకించి శ్రీలక్ష్మీ జపము నిర్వహిస్తున్నారు.దీనికై టికెట్లు తీసుకున్న భక్తులకు పూజలు జరిపి వారికి స్వామివారి ఫోటో,ప్రసాదం అందించ బడుతుందని,ప్రతివారం కార్యక్రమంలో పాల్గొనజాలని భక్తులకు,గోత్ర నామాల తో పూజలు నిర్వహిస్తామని లక్ష్మీనరసింహ స్వామి దేవస్థానం ఎసి,ఇఓ శ్రీనివాస్ తెలిపారు.

**మహాలక్ష్మీ హెూమ కార్యక్రమం**

ప్రతి సంవత్సరంలాగానే ఈ సంవత్సరం కూడా సెప్టెంబర్ 26నుండి సంవత్సరం పాటు శుక్రవారాల రోజున ధాన్యభివృద్ధికి,రుణ విమోచనకు, ఆరోగ్యాభివృద్ధికి,ఉద్యోగ ప్రాప్తికి, మనశ్శాంతికి,వివాహం కావడానికి లక్ష్మీ హెూమ ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని ఇఓ శ్రీనివాస్ తెలిపారు.ప్రతి శుక్రవారం ఉదయం జరిగే ఈకార్యక్రమంలో ఒక సారి చెల్లింపుతో సంవత్సరం వారి గోత్రనా మాలతో లక్ష్మీహెూమం నిర్వహింపజేసి, చీర,ఉత్తరీయం,ఫోటో,లడ్డూ,లక్ష్మీ యంత్రం ప్రసాదము అందజేస్తామని ఆయన వివరించారు.ప్రత్యేక కార్యక్రమా లలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారిని సేవించి, తీర్థప్రసాదాలు స్వీకరించి,దైవకృపకు పాత్రులై ఈ సదవకాశాన్ని వినియోగించుకోవాలని ఇఓ శ్రీనివాస్ విజ్ఞప్తి చేశారు.

# ఘనంగా టియుడబ్ల్యు జే ఐజేయూ జిల్లా అధ్యక్షుడి జన్మదిన వేడుకలు

**చురకలు ప్రతినిధి,మెట్ పల్లి, సెప్టెంబర్ 25 :**

టీయూడబ్ల్యూజే (ఐజేయు) జగిత్యాల జిల్లా అధ్యక్షులు చీటీ శ్రీనివాసరావు జన్మదిన వేడుకలు మెట్ పల్లి ప్రెస్ క్లబ్ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. అనంతరం నిరుపేదలకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు బూరం సంజీవ్ జనరల్ సెక్రెటరీ మహమ్మద్ అజీమ్ ఉపాధ్యక్షులు జంగం విజయ్ సాజిద్ పాషా, గౌరవ అధ్యక్షులు మాసుల ప్రవీణ్ , గౌరవ సలహాదారులు దాసం కిషన్,క్యాషియర్ మక్సూద్, జాయింట్ సెక్రెటరీ పుంద్ర శశికాంత్ రెడ్డి, పింజరి శివ,ఆర్గనైజింగ్ సెక్రెటరీ ఎండి సమీయుద్దీన్, కార్యవర్గ సభ్యులు పోనగాని మహేందర్, కుర్ర రాజేందర్ ,యానం రాకేష్ ,రఫీ ఉల్లా, సోహెల్ , హైమద్, ముత్యాల రమేష్ , ఎండి అఫ్రోజ్,బాసెట్టి హరీష్ ,విజయసాగర్, సభ్యులు ఆగ సురేష్,బొల్లం రాజు,ఆదిల్ పాషా, ఏసమేని గణేష్, ఎండి అభిద్,



ఓంకార్ శ్రీనివాస్, రాజశేఖర్, అమ్ముల ప్రవీణ్, తదితరులు పాల్గొన్నారు.

## శేష వాహనంపై వెంకటేశ్వరస్వామి ఊరేగింపు



**చురకలు విలేకరి ఇబ్రహీంపట్నం సెప్టెంబర్ (25) :** జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండలంలోని గోదుర్,తిమ్మాపుర్, యామాపుర్, వేములకుర్తి, వర్షకోండ,ఇబ్రహింపట్నం గ్రామాలలో శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా విజయదశమి కి ముందు వెంకటేశ్వర స్వామి పల్లకి(శావ)సేవ గ్రామాల్లో కొనసాగుతుంది. గురువారం ఆయా గ్రామాలకు చెందిన దేవాలయ కమిటీ సభ్యులు స్వామివారిని ప్రత్యేక పల్లకీలో అర్చకుల వేదమంత్రాలు చరణ మధ్య స్వామివారిని శేషవాసనంపై మాడవీధులలో ఊరేగింపు నిర్వహించారు. భక్తులు స్వామి వారికి మంగళహారతులు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామాల ఆలయ కమిటీ సభ్యులు,మహిళలు భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## అట్లబతుకమ్మ వేడుకలు



**చురకలు విలేకరి ఇబ్రహీంపట్నం సెప్టెంబర్ (25) :** జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండలంలోని గోదుర్, తిమ్మపుర్, తిమ్మపుర్ తండ,యామాపుర్, ఫకిర్ కోండాపుర్, వేములకుర్తి, బర్దిపుర్, ములరాంపుర్, ఎర్దండి, కోమటి కోండాపుర్,వర్షకోండ,డబ్బ,అమ్మకపెట్, ఇబ్రహింపట్నం, ఎర్రపుర్,కేశాపుర్, కోజన్ కోత్తుర్ గ్రామలలో బతుకమ్మ పండగ సంబరాలు కోనసాగుతున్నయి. ఐదవరోజు అట్లబతుకమ్మ ను అడి మహిళలు, చిన్నారులు బతుకమ్మ కు హారతులు ఇచ్చి ప్రత్యేక పులతో అలంకరణ చేసి నిమజ్జనం చేశారు. ఈకార్యక్రమంలో అయాగ్రామల మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## జగిత్యాలలో దారుణం...

### -హెూటల్ కుక్ చేతిలో వెయిటర్ హత్య

**చురకలు ప్రతినిధి, జగిత్యాల, సెప్టెంబర్ 25 :** ఇద్దరి మధ్యలో జరుగుతున్న గొడవను నిలువరించేందుకు వెళ్లిన హెూటల్ వెయిటర్ కుకింగ్ మాస్టర్ చేతిలో దారుణ హత్యకు గురైన ఘటన జగిత్యాలలో చోటుచేసుకుంది. జగిత్యాల పట్టణ శివారులోని ఓ దాబాలో వంట మాస్టర్ గా పనిచేస్తున్న నేపాల్ కు చెందిన చరణ్ దీప్ సింగ్ హెూటల్ లో పనిచేసే మరో వ్యక్తితో గొడవపడుతున్నాడు. గొడవను గమనించిన వెయిటర్ వంగ శ్రీనివాస్ (44) ఇరువురి గొడవను ఆపేందుకు ప్రయత్నం చేస్తుండగా, కోపంతో ఊగిపోయిన వంట మాస్టర్ చరణ్ దీప్ సింగ్ బీరు బాటిల్‌తో శ్రీనివాస్ తలపై బాధడంతో శ్రీనివాస్ అక్కడిక్కడే మృతి చెందాడు. హెూటల్ నిర్వాహకులతో సమాచారం అందుకున్న జగిత్యాల టౌన్ పిఎస్ పోలీసులు శవ పంచనామా అనంతరం మృతదేహాన్ని జగిత్యాల జిజిహెచ్ మార్చురీకి తరలించారు. కాగా ఘటనపై జగిత్యాల టౌన్ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. అయితే ఇటీవల ఆటో కిరాయి విషయంలో బీహార్ కు చెందిన వలస కూలీల చేతిలో ఆటో డ్రైవర్ హత్యకు గురికాగా,20 రోజులు కూడా గడవకు ముందే నేపాల్ కు చెందిన వంట మాస్టర్ చేతిలో వెయిటర్ హత్యకు గురైన ఘటన స్థానికంగా కలకలం రేపింది.

## విధులకు ఆటంకం కలిగించిన వ్యక్తిపై ఫిర్యాదు

**చురకలు ప్రతినిధి కమాన్‌పూర్ సెప్టెంబర్ 25 :** విధులు నిర్వహిస్తున్న గ్రామ కార్యదర్శి విధులకు ఆటంకం కలిగించిన వ్యక్తిపై కేసు నమోదయినట్లు తెలిసింది.రామగిరి మండలం లంక కేసారం గ్రామంలో విధులు నిర్వహిస్తున్న పంచాయతీ కార్యదర్శి పై అదే గ్రామానికి చెందిన కె. సదయ్య అనే వ్యక్తి దుర్భాషలాడి, విధులకు ఆటంకం కలిగించినందుకు అతనిపై కఠిన చర్యలు తీసుకోవాలని పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసినట్లు సమాచారం. ఇట్టి సంఘటనను రామగిరి మండల పంచాయతీ కార్యదర్శుల ఫోరం తీవ్రంగా ఖండించినది.

# కాత్యాయనీ దేవిగా దర్శనమిచ్చిన అమ్మవారు

**-అమ్మవారికి పంచామృత అభిషేకాలు భక్తుల ప్రత్యేక పూజలు**

**-భజరంగ్దళ్ సేన ఆధ్వర్యంలో వేములకుర్తిలో అన్నప్రసాద వితరణ**



**చురకలు విలేకరి ఇబ్రహీంపట్నం సెప్టెంబర్ (25) :** జగిత్యాల జిల్లా ఇబ్రహింపట్నం మండలం లోని వేములకుర్తి,బర్దిపుర్,ములరాంపుర్,గోదుర్, తిమ్మపుర్,ఇబ్రహింపట్నం,డబ్బ, యామపుర్,ఎర్దండి,ఫకిర్ కోండాపుర్, వర్షకోండ,అమ్మకపెట్,కోమటి కొండాపూర్, కేశాపూర్,కోజన్ కొత్తూరు గ్రామలలో గురువారం కాత్యాయన దేవిగా భక్తులకు దర్శమించారు. దుర్గాదేవి శరన్నవరాత్రి నవరాత్రి ఉత్సవాలలో భాగంగా ఉత్సవ కమిటీ సభ్యులు,భవాని దీక్ష భక్తులు అమ్మవారికి ప్రత్యేక పుజలలో పాల్గొన్నారు.అర్చకుల వేదమంత్రోచ్ఛరణ మధ్య గణపతిపుజా, కళిశ పుజ ,అమ్మవారి స్థాపితదేవత అరాదన, నవగ్రహ,అమ్మవారికి పంచామృత అభిషేకాలు అష్టోత్తర పూజలను నిర్వహించి మంచహారతి నక్షత్ర హారతి కర్పూర హారతి అమ్మవారికి ఇచ్చారు. అనతరం భక్తులకు తీర్థ ప్రసాద వితరణ చేశారు.వేములకుర్తి బజరంగ్ ధళ్ సేన ఆధ్వర్యంలో అన్నప్రసాద వితరణ జరిగింది.ఈ కార్యక్రమంలో అయాగ్రామల ప్రజాప్రతినిధులు,ఉత్సవ కమిటీ సభ్యులు,మహిళలు భక్తులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రమాదకరంగా రహదారులు...!

**-ప్రమాదాలు జరిగిన పట్టించుకోని అధికారులు**



**చురకలు విలేకరి ఇబ్రహీంపట్నం సెప్టెంబర్ (25) :** ప్రమాదాలు జరిగి ప్రాణాలు పోతానే స్పందిస్తారా అంటే అవును అనే విధంగా ఉంది ఆర్ అండ్ బి రహదారులు మారాయి.పలుమార్లు ఉన్నతాధికారుల దృష్టికి ,స్థానిక ప్రజా ప్రతినిధులు నాయకుల దృష్టికి తీసుకు వెళ్లిన రహదారులకు మరమ్మతులు జరగకపోవడంతో ప్రమాదాలుతున్నాయి.రహదారులు అధ్వానంగా మారిన పట్టించుకునేవారు కరువయ్యారు అందుకు నిదర్శనంగా మండల రహదారులు తయారయ్యాయి. జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండలంలోని మెడిపెల్లి- ఇబ్రహీం పట్నం, గోదుర్ - వర్షకోండ,మెట్ పల్లి -గోదుర్ ఆర్ అండ్ బి రహదారులు అస్తవ్యస్తంగా మారాయి. మండల కేంద్రం మీదుగా వర్షకొండ కు వెళ్లే 11 కిలోమీటర్ల సింగల్ తారు రోడ్డును 2015 లో 10 కోట్ల వ్యాయంతో డబుల్ రోడ్డుగా మార్చారు.గతంలో కురిసిన భారీ వర్షాలకు రోడ్డు అక్కడక్కడ ధ్వంసం కాగా రూపాయలు ఒక లక్షతో 2022 లో ప్యాచ్ వర్క్ నామమాత్రంగా చేశారు. అలాగే 2023లో ప్యాచ్ వర్క్ చేయకుండా కంకర వేసి వదిలేయడంతో రోడ్డు పూర్తిగా గుంతల ఏర్పడి ప్రమాదకరంగా మారాయి. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ రోడ్డు వెంట నిత్యం చిన్న వాహనాలతో పాటు భారీ వాహనాలు వందల సంఖ్యలో రాకపోకలు కొనసాగిస్తుంటాయి. రాత్రి వేళలో ఈ తారు రోడ్డుపై ప్రయాణించే వాహన చోదాకులు రోడ్డును అంచనా వేయకుండా ప్రయాణిస్తే ప్రమాదాల బారిన పడే అవకాశం లేకపోలేదు. గోదూరు నుంచి మండల కేంద్రానికి వాహనంలో వెళ్లాలంటే ఆరు కిలోమీటర్ల ప్రయాణానికి అరగంట పడుతుంది అంటే రోడ్డు ఎలా ఉందో అంచనా వేయవచ్చు. కొన్నిచోట్ల రోడ్డు మరి ప్రమాదకరంగా మార్గంతో వాహన చోదకులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దాదాపు మూడు సంవత్సరాల్లో పదుల సంఖ్యలో ప్రమాదాలు జరిగిన అధికారులు పట్టించుకోవడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారని మండల ప్రజలు వాపోతున్నారు.

## చేనేత రంగంపై విధించిన జిఎస్టిని తొలగించాలి

**-భారత రాష్ట్రపతికి ఎమ్మెల్సీ రమణ లేఖ**



**చురకలు ప్రతినిధి, జగిత్యాల, సెప్టెంబర్ 25 :** చేనేత రంగంపై విధించిన జీఎస్టిని తక్షణమే తొలగించాలని కోరుతూ తెలంగాణ శాసన మండలి సభ్యులు ఎల్.రమణ గురువారం భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్మకు లేఖ రాశారు. చేనేత కార్మికులు ఎదుర్కొంటున్న కష్టాలను తన లేఖలో వివరించారు.2017లో ముడి సరుకులపై విధించిన 5 శాతం జీఎస్టీ, ఇప్పుడు చేనేత ఉత్పత్తులపై పెంచిన 15శాతం జీఎస్టి వల్ల లక్షలాది చేనేత కుటుంబాల జీవనోపాధి దెబ్బ తిందని ఆయన పేర్కొన్నారు.ఈ పన్ను పెంపు నిర్ణయం చేనేత కార్మికులతో సంప్రదింపులు లేకుండానే జరిగిందని, ఇది వారి రాజ్యాంగ హక్కులను ఉల్లంఘిస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. చేనేత రంగం భారతీయ సంస్కృతికి, గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు అత్యంత కీలకమైనదిగా అభివర్ణించారు. ఆల్ ఇండియా హ్యాండ్లూమ్ బోర్డు రద్దు, ఖాదీకి ఉన్న పన్ను మినహాయింపు చేనేతకు లేకపోవడం వంటి అంశాలను ఆయన తన లేఖలో ప్రస్తావించారు. చేనేత ఉత్పత్తులు మరియు ముడి సరుకులపై జీరో జీఎస్టిని అమలు చేయాలని,చేనేత సంబంధించిన నిర్ణయాలు తీసుకునేటప్పుడు కార్మికులను భాగస్వాములను చేయాలని, హ్యాండ్లూమ్ బోర్డును పునరుద్ధరించాలని రమణ రాష్ట్రపతిని అభ్యర్థించారు. ఈ అంశంపై రాష్ట్రపతి భక్షణమే జోక్యం చేసుకుని, వేలాది కుటుంబాలను రక్షించాలని రమణ విజ్ఞప్తి చేశారు.

## బతుకమ్మ సంబరాలకు వరుణుడి అడ్డంకి



**చురకలు, విలేఖరి, వెల్గటూర్, సెప్టెంబర్ 25 :** ప్రతియేటా తెలంగాణా లో మహిళలు అత్యంత భక్తి శ్రద్దలతో తీరొక్క పూలను సేకరించిపేర్చితొమ్మిది రోజుల పాటు ఆడిపాడుకునే బ్రతుకమ్మ పండుగ ఉత్సవాలు ప్రారంభం రోజు నుండే వర్షంకురుస్తుండడంతో బతుకమ్మ సంబరాలకు ఆటంకం ఏర్పడి మహిళలు నిరాశకు గురౌతున్నారు. జగిత్యాల జిల్లా వెల్గటూర్ ఉమ్మడి మండలం తోపాటు పలుచోట్ల బతుకమ్మ ప్రారంభం నుండి ఆడపా దడపా వర్షం కురుస్తూనే ఉంది. బాద్రపద అమావాస్య నుండి ఎంతో ఉత్సాహంగా బతుకమ్మలు పేర్చి సాయంత్రం ఆడిపాడుకునే సమయానికి వరుణుడు అడ్డంకి కలిగించడంతో ఐదు రోజులు గడిచిపోవడం,మరో నాలుగైదు రోజులు వర్షం కురిసే పరిస్థితి ఉందని వాతావరణ శాఖ ప్రకటించడం తో ఈ ఏడు బ్రతుకమ్మ సంబరాలు సంతోషంగా జరుపుకునే పరిస్థితి లేదని మహిళలు,ఆడపడు చులు ఆవేదన వ్యక్తం చేస్తు న్నారు.బ్రతుకమ్మ సంబరాలు జరుపుకోవడానికి అన్నిఏర్పాట్లు చేసుకున్నప్పటికి వర్షంఅడ్డంకితో ఇబ్బంది పడుతున్నారు. సద్దుల బ్రతుకమ్మ చివరి రోజు ఈ నెల 30 నాడైనా వరుణుడు కనికర స్తాడో లేదోనని అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.బతుకమ్మ సంబరాలు నాలుగు రోజుల్లో ముగియ నుండడంతో వర్షం కరుణించి బ్రతుకమ్మ పండుగ కు ఆటంకం కలగకుండా ఉంటే బాగుంటుందని మహిళలు ఆశా బావం వ్యక్తం చేస్తున్నారు.

## జిపిఎఫ్ ప్రతిపాదనలు జడ్పి కార్యాలయంలో స్వీకరించాలి



**చురకలు ప్రతినిధి, జగిత్యాల,సెప్టెంబర్ 25 :** జగిత్యాల జిల్లాలోని జిల్లా పరిషత్ అధీనంలో పనిచేస్తున్న దాదాపు 1600 మంది ఉపాధ్యాయుల జిపిఎఫ్ లోన్స్ పార్ట్ ఫైనల్స్, ఫైనల్ పేమెంట్ జిల్లా విద్యాధికారి కార్యాలయం ద్వారా కాకుండా నేరుగా జిల్లా పరిషత్ కార్యాలయంలో స్వీకరించాలని జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వాహణాధికారి గౌతమ్ రెడ్డికి సిఆర్టియు టిఎస్ జగిత్యాల జిల్లా శాఖ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు బోయిని పెల్లి ఆనందరావు, యాళ్ల అమర్నాథ్ రెడ్డిలు గురువారం వినతి పత్రం అందజేశారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో మాదిరిగానే జీవో ఎంఎస్ నెంబర్ 40 ప్రకారం ప్రధానోపాధ్యాయులు,మండల విద్యాధికారుల మంజూరు చేసిన జిపిఎఫ్ లోన్స్ మరియు పార్ట్ ఫైనల్స్ ప్రతిపాదనలు నేరుగా జిల్లా పరిషత్ కార్యాలయంలో స్వీకరించాలని వారు కోరారు.

## ఘనంగా ప్రపంచ ఫార్మసిస్ట్స్ డే




**చురకలు ప్రతినిధి, జగిత్యాల, సెప్టెంబర్ 25 :** జగిత్యాల పట్టణంలో గురువారం ప్రపంచ ఫార్మసిస్ట్స్ డే వేడుకలను డా.విఆర్ కె కాలేజ్ ఆఫ్ ఫార్మసీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలోని కొత్త బస్టాండ్ వద్ద ఆరోగ్య సంరక్షణలో ఫార్మసిస్టుల పాత్ర అనే అంశంపై చేపట్టిన ర్యాలీని జగిత్యాల డిఎస్పీ రఘుచందర్ జెండా ఊపి ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు లక్ష్యాలకు అనుగుణంగా చదువుతూ,అనుకున్న లక్ష్యాలను చేరుకోవాలన్నారు.ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ హెచ్.పరమేశ్వర్,ఏనో మీర్ ఖాజీం అలీ, అధ్యాపకులు,విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## పండిత్ దీన్ దయాళ్‌కు ఘన నివాళ్లు




**చురకలు ప్రతినిధి, జగిత్యాల, సెప్టెంబర్ 25 :** జగిత్యాల పట్టణంలోని జిల్లా బిజెపి కార్యాలయంలో పండిత్ దీన్ దయాల్ జయంతి వేడుకలను బిజెపి జిల్లా అధ్యక్షుడు రాచకొండ యాదగిరి బాబు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా డా. బోగ శ్రావణి, నాయకులు దీన్ దయాళ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన చేసిన సేవలను కొనియాడుతూ, ప్రతి ఒక్కరు ఆయన ఆశయ సాధనకు కృషి చేయాలన్నారు.ఈ కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు డా. భోగ శ్రావణి, జిల్లా ప్రధాన కార్యదర్శులు వడ్డేపల్లి శ్రీనివాసన్ నలువాల తిరుపతి, పిల్లి శ్రీనివాస్, జిల్లా ఉపాధ్యక్షులు మ్యాదరి అశోక్, కార్యాలయ కార్యదర్శి జుంబర్తి దివాకర్, జిల్లా కార్యదర్శులు పాత రమేష్, తుకారాం గౌడ్ పట్టణ, మండల అధ్యక్షులు కొక్కు గంగాధర్, రెంటం జగదీష్, కుమ్మరి తిరుపతి, పట్టణ ప్రధాన కార్యదర్శులు సిరికొండ రాజన్న, ఆముదరాజు, ఇట్యాల రాము, మరి శెట్టి సుమత, సీనియర్ నాయకులు జున్ను రాజేందర్, మరి పెల్లి సత్యం, చందోలి లక్ష్మణ్, బద్దెల గంగరాజం, దిటీ వెంకటేష్, కాశెట్టి తిరుపతి, మామిడాల రాజగోపాల్, దురుశెట్టి రమణ,కళ్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

# కాత్యాయనీ దేవి అలంకరణలో అమ్మవారు

## -నవరాత్రుల్లో అనేక రూపాలలో దర్శనమిస్తున్న అమ్మవారు



**చురకలు ప్రతినిధి కమాన్‌పూర్ సెప్టెంబర్ 25 :** దేశమంతటా శరన్నవరాత్రి ఉత్సవములు దేవి ఆలయాల్లో ఘనంగా నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా గురువారం శ్రీ మహాలక్ష్మి కాత్యాయనీ దేవి అలంకరణ లో పూజలు అందుకున్నారు. నవ దుర్గలలో ఆరవ అవతారం శ్రీ కాత్యాయని దేవి మాత. కోశ అనే ఒక ఋషి పార్వతీదేవి తనకి కూతురుగా జన్మించాలంటూ ఘోర తపస్సు చేయగా ఆ రుషి కూతురుగా కాత్యాయని దేవి జన్మించింది. అందువలనే ఈ దేవి మాతకు కాత్యాయని అనే పేరు వచ్చింది. ఈ అవతారంలో దర్శనం ఇచ్చే ఆలయం కర్ణాటక రాష్ట్రంలో ఉంది. కమాన్‌పూర్ మండల కేంద్రంలో చత్రపతి శివాజీ ఆధ్వర్యంలో సుభాష్ యూత్ ఆధ్వర్యంలో శ్రీనగర్ కాలనీ, క్రాస్ రోడ్ వద్ద తోట వీరయ్య ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన మండపాల్లో అమ్మవారిని దర్శించుకోవడానికి భక్తులు విశేష సంఖ్యలో తరలివచ్చారు.

**నవరాత్రి ఉత్సవం యొక్క విశిష్టత :** శారదారాధ్యా శరదృతువులో ఆరాధింపబడే తల్లి శరదృతువులో ప్రకృతిలో వచ్చే మార్పులు కొన్ని రోగాలకు కారణమవుతాయి. కొన్ని బాధలు కూడా కలిగిస్తాయి. కొన్ని వైపరీత్యాలు కూడా కనిపిస్తు ఉంటాయి. అది ప్రకృతిలో వచ్చే పరిణామం. వాటిని యమ దంష్ట్రికలు అంటారు. వాటి బాధ రాకుండా ప్రకృతిని, ప్రకృతిలోని జీవులనూ కాపాడడానికై ప్రకృతికి కూడా నియామకురాలైన పరాశక్తిని ఆరాధిస్తారు. ప్రకృతి క్షేమానికై, ప్రజా క్షేమానికై ఋషులు ఏర్పరచిన ఒక చక్కని పద్ధతి. శరన్నవరాత్రులలో అమ్మవారి ఆరాధన ఒక్కొక్కరూ ఒక్కొక్క పద్ధతిలో ఆరాధిస్తుంటారు. కొందరు యజ్ఞాల రూపంలో హెూమాలు చేస్తారు. కొంత మంది స్తోత్ర పారాయణలు చేస్తారు. కొంతమంది జపం చేస్తారు. కొంతమంది కలశం వంటివి స్థాపన చేసి తొమ్మిదిరోజులూ రెండుపూటలా పూజ చేస్తారు. వీటికి రకరకాల విధానాలున్నాయి. వారి వారి శక్త్యనుసారం పూజిస్తుంటారు. కొందరు శ్రీవిద్యారూపంగా శ్రీచక్రం, కొంతమంది చండీదేవతను, దుర్గాదేవిని ఆరాధన చేస్తుంటారు. ఏదైనా ఒకే దేవిని వారి వారి పద్ధతులలో కొలుస్తారు. అయితే ఒకే తల్లి అనేక రూపాలలో ఉన్నది అనే భావం తెలియడం కోసమే నవరాత్రులలో కొన్ని ఆలయాలలో ఒక్కొక్క రోజు ఒక్కొక్క అలంకారంలో అలంకరించి పూజిస్తుంటారు.

### కాయిత సతీష్ యాదవ్‌కు

# ఉస్మానియా యూనివర్సిటీ నుండి డాక్టరేట్ పట్టా




**చురకలు విలేఖరి వీణవంక సెప్టెంబర్ 25 :** ఉస్మానియా యూనివర్సిటీ సోషియాలజీ విభాగానికి చెందిన పరిశోధకుడు కాయిత సతీష్ యాదవ్ డాక్టరేట్ పట్టా అందుకున్నారు. కరీంనగర్ జిల్లా వీణవంక మండలంలో ఘన్ముక్ల గ్రామానికి చెందిన వ్యవసాయ-గొర్రెల కాపరి కుటుంబంలో జన్మించిన సతీష్ యాదవ్ పాలమూరు ప్రాంత మేతకార్మికుల వలస జీవనాన్ని పరిశీలించి వారి చరిత్ర, వలసల కారణాలు ప్రస్తుత పరిస్థితులు అలాగే గ్లోబలైజేషన్, పారిశ్రామికీకరణ, పట్టణీకరణ ప్రభావాలను లోతుగా అధ్యయనం చేశారు. తన పరిశోధనలో గొల్లకురుమల సామాజిక చరిత్ర, వృత్తి, సాంస్కృతిక వారసత్వం, తాళపత్ర గ్రంథాలు, రాగిపలకల ఆధారాలు అలాగే పెద్దిరాజు, పెద్దమ్మ, వారి కుమారుడు కాటమరాజు వంటి జానపద వీరుల గాథలను విశ్లేషించారు. అంతేకాకుండా ఆశ్రిత కులాలైన మంద హెచ్చులు, బైకాని, పొడపోతులు, వీరన్నలు తదితర ఉపకులాల సమాచారాన్ని కూడా నిక్షిప్తం చేశారు. ప్రభుత్వ పథకాలు, పశుసంరక్షణ సేవలు ఈ వృత్తిజీవులకు చేరడం లేదని, భవిష్యత్తులో ఇది తీవ్రమైన సమస్యలకు దారి తీస్తుందని తన పరిశోధనలో సతీష్ యాదవ్ హెచ్చరించారు. ఆయన 'గొల్లకురుమాస్ సోషల్ హిస్టరీ, కాంటెంపరరీ స్టేటస్ అండ్ ఫ్యూచర్ ప్రాస్పెక్ట్స్ - ఏ సోషియాలజికల్ స్టడీ ఆఫ్ పాలమూరు రీజియన్ ఇన్ తెలంగాణ స్టేట్' అనే అంశంపై సమగ్ర పరిశోధన చేశారు. ఈ పరిశోధనకు డాక్టర్ ఎన్ వి మాధురి, ప్రధాన పర్యవేక్షకురాలిగా డాక్టర్ రామ్ షెఫర్డ్ భీనవేని సహ పర్యవేక్షకునిగా మార్గనిర్దేశం చేశారు. ఈ సందర్భంగా నాకు సహకారం అందించిన తల్లిదండ్రులు పలువురు కృతజ్ఞతలు తెలిపారు.

# పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరు కృషి చేయాలి

## -తెలంగాణ గ్రామీణ బ్యాంక్ రీజనల్ మేనేజర్ బాలనాగు



**చురకలు ప్రతినిధి, కరీంనగర్, సెప్టెంబర్25 :** నానాటికి పెరిగిపోతున్న కాలుష్యాన్ని తగ్గించడానికి, పర్యావరణాన్ని పరిరక్షించడానికి ప్రతి ఒక్కరు కృషి చేయాల్సిన అవసరం ఉందని తెలంగాణ గ్రామీణ బ్యాంక్ రీజనల్ మేనేజర్ శ్రీమతి బాలనాగు అన్నారు. "స్వచ్ఛత హీ సేవ" కార్యక్రమంలో భాగంగా గురువారం స్థానిక బిఆర్ అంబేద్కర్ క్రీడా ప్రాంగణంలో తెలంగాణ గ్రామీణ బ్యాంక్ కరీంనగర్ రీజినల్ బిజినెస్ కార్యాలయ అధికారులు సిబ్బందితో కలిసి 'ఏక్ దిన్ ఏక్ గంట ఏక్ సాత్' నినాదంతో శ్రమదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రీజినల్ మేనేజర్ అంబేద్కర్ క్రీడా ప్రాంగణంలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, భవిష్యత్తు తరాలకు ఆరోగ్యకర సమాజాన్ని అందించాలంటే ప్రతి ఒక్కరు పర్యావరణాన్ని కాపాడేందుకు కృషి చేయాలని కోరారు. పర్యావరణాన్ని కాపాడడాన్ని ప్రతి ఒక్కరూ తమ జీవితంలో అంతర్భాగంగా చేసుకోవాలని సూచించారు. తెలంగాణ గ్రామీణ బ్యాంక్ ఆధ్వర్యంలో ఏడాదిలో 100 గంటలు పర్యావరణ పరిరక్షణలో భాగంగా శ్రమదానం కోసం వెచ్చిస్తామని వెల్లడించారు. రాష్ట్రవ్యాప్తంగా 17 వ్యాపార ప్రాంతీయ కార్యాలయాలు, 934 శాఖలతో కొనసాగుతున్న తెలంగాణ గ్రామీణ బ్యాంక్ కేవలం వ్యాపారానికే పరిమితం కాకుండా, సామాజిక సేవా కార్యక్రమాలో చురుకుగా పాల్గొంటున్న విషయాన్ని గుర్తు చేశారు. కేంద్ర ప్రభుత్వం 50%, ఎస్బిఐ 35%, రాష్ట్ర ప్రభుత్వం 15% వాటాతో ఎక్కువగా గ్రామీణ ప్రాంతాల లో సేవలు అందిస్తున్న టీజీబి 2024-25 ఆర్థిక సంవత్సరంలో 73,791 కోట్ల వ్యాపారంపై 675 కోట్ల నికర లాభాన్ని ప్రకటించిందన్నారు. 'స్వచ్ఛత హీ సేవ' కార్యక్రమంలో భాగంగా వర్షాన్ని లెక్కచేయకుండా తెలంగాణ గ్రామీణ బ్యాంక్ సిబ్బంది అంబేద్కర్ క్రీడా ప్రాంగణంలో ప్లాస్టిక్ వ్యర్థాలు, చెదారాలను తొలగించారు. ఈ కార్యక్రమంలో సిఎంబి విజయ్ సింగ్, ఎస్ ఎం ఓ సుబ్బారావు, చీఫ్ మేనేజర్ రమణారెడ్డి, సీనియర్ మేనేజర్ మురళీధర స్వామి, మేనేజర్ కొండపల్లుల వేణుమాధవ్ ,సాయి కిరణ్ రెడ్డి, పలువురు మేనేజర్లు, రీజినల్ బిజినెస్ కార్యాలయ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



## ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో బతుకమ్మ వేడుకలు



**చురకలు ప్రతినిధి కమాన్‌పూర్ సెప్టెంబర్ 25 :** కమాన్ పూర్ మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గురువారం వైద్య సిబ్బంది మహిళలు బతుకమ్మ వేడుకలను నిర్వహించారు. బతుకమ్మల సీజన్లో భాగంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్ర సిబ్బంది ఏఎన్ఎం లు ఆశా వర్కర్లు బతుకమ్మ వేడుకల్లో పాల్గొని తెలంగాణ యాసలో పాటలు పాడారు. వివిధ రకాల పూలతో బతుకమ్మలను తయారుచేసి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద బతుకమ్మకు పూజలు చేసి బతుకమ్మ వేడుకలను నిర్వహించుకున్నారు. ఈ కార్యక్రమంలో బాల భారతి ఇందిరా శైలజ శ్యామల శ్రీలత మేటీరియా కృష్ణవేణి మల్లీశ్వరి పుష్పలత కృష్ణవేణి పుష్పలత హేమలత శ్రీలత సునీత తదితరులు పాల్గొన్నారు.

## మున్నూరు కాపు యువత మండల అధ్యక్షుడిగా మద్దుల ప్రశాంత్ పటేల్



**చురకలు విలేఖరి వీణవంక సెప్టెంబర్ 25 :** కరీంనగర్ జిల్లా వీణవంక మండలం మున్నూరు కాపు యువత మండల స్థాయి లో జరిగిన సమావేశంలో మున్నూరు కాపు యువత వీణవంక మండల అధ్యక్షుడిగా మద్దుల ప్రశాంత్ పటేల్ ని నియమిస్తూ మున్నూరు కాపు సంఘం తెలంగాణ రాష్ట్ర కన్వీనర్ చింతపండు మహేందర్ నియామక పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో మున్నూరు కాపు సంఘం తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి ఇమిడిశెట్టి మోహన్, మున్నూరు కాపు యువత రాష్ట్ర కార్యదర్శి ఆకనేని తిరుపతి పాల్గొన్నారు.

## బండి సంజయ్‌ను కలిసిన బీజేపీ నాయకులు



**చురకలు విలేఖరి వీణవంక సెప్టెంబర్ 25 :** వీణవంక మండల కేంద్రానికి చెందిన బిజెపి పార్టీ నాయకులు గురువారం కేంద్రమంత్రి, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ కుమార్‌ను కరీంనగర్ జిల్లా కేంద్రంలో కలిశారు. వీణవంక గ్రామ అభివృద్ధి పనులపై, కల్వల ప్రాజెక్టు మరమ్మత్తు ల పై మంత్రిని కోరగా సానుకూలంగా స్పందించారని తెలిపారు. రానున్న స్థానిక ఎన్నికలలో బిజెపి పార్టీ బలోపేతానికి కృషి చేయాలని కోరారని తెలిపారు. కేంద్ర మంత్రి బండి సంజయ్ నీ కలసిన వారు జిల్లా అధ్యక్షులు గంగాడి కృష్ణారెడ్డి, మండల అధ్యక్షులు బత్తిని నరేష్, బూతు నాయకులు కంకల సంతోష్, మోటం శ్రీనివాస్, సీనియర్ నాయకులు బాపన్న, యువ నాయకులు అమృత ప్రభాకర్ తదితరులు ఉన్నారు.

# విప్లవ యోధుడికి అంతిమ వీడ్కోలు

**-ఎర్ర సంద్రంలా మారిన గోపాల్ రావు పల్లి**
**-అరుణాంజలి ఘటించిన పలువురు ప్రముఖులు**
**-కంటతడి పెట్టించిన కళాకారుల పాటలు**
**-కోసా దాదా పేరుతో విప్లవ గీతాలు**
**-మారుమోగిన అమర్ రహే నినాదాలు**



**చురకలు ప్రతినిధి ఎల్లారెడ్డిపేట సెప్టెంబర్ 25 :** అబుజ్మాడ్ నారాయణ్ పూర్ జిల్లాలో సోమవారం జరిగిన ఎన్ కౌంటర్‌లో మృతి చెందిన మావోయిస్టు కేంద్ర కమిటీ సభ్యుడు కడారి సత్యనారాయణరెడ్డి అలియాస్ కోసా దాదాఅలియాస్ ఐటిఐ సత్తన్న అభిమానులు,ప్రజాసంఘాలు,బంధు మిత్రులు కన్నీటి వీడ్కోలు పలికారు. విప్లవ సూర్యుడు కోసా దాదా అంతిమ వీడ్కోలు పలికేందుకు తెలంగాణ సహా వివిధ రాష్ట్రాలకు చెందిన ప్రజా సంఘాల నాయకులు,ప్రముఖులు కడారి సత్యనారాయణరెడ్డి స్వగ్రామానికి వేలాదిగా జనం తరలి భారీగా చేరుకోవడంతో..గోపాల్‌రావు పల్లి గ్రామం ఎర్ర జెండాలతో శుక్ర వారం ఎర్ర జనసంద్రంగా మారింది. కడారి సత్యనారాయణరెడ్డి పార్థివ దేహానికి పూలమాల వేసి అరుణాంజలి ఘటించారు,శోకసముద్రంలో ఉన్న దాదా కుటుంబ సభ్యులను వారు ఓదార్చారు.అంతిమ యాత్రలో విప్లవ గీతాలు, విప్లవ నినాదాలతో గోపాల్ రావు పల్లి ఎరుపెక్కింది.విప్లవ యోధుడికి అడుగడుగునా అరుణ జోహార్లు అర్పిస్తూ జనం వేలాదిగా తరలినారు.ఈ అంతిమయాత్ర జనకడలిని తలపించింది.చివరి మజిలీ వరకు కొనసాగింది.కడారి సత్యనారాయణ రెడ్డి విప్లవోద్యమ చరిత్ర విని కన్నీరు మున్నీరుగా ప్రజానీకం విలపించారు.కడారి బూటకపు ఎన్ కౌంటర్ అని ప్రజాసంఘాలు ఆరోపించాయి.సుప్రీం కోర్టు జడ్జితో న్యాయ విచారణ జరిపించాలని డిమాండ్ చేశాయి.

**మారణ హోమం ఆపాలి**

భారత్ బచావో అధ్యక్షులు గాదె ఇన్నయ్య మాట్లాడుతూ దేశ ప్రజలకు విముక్తి కోసం ఉద్యమించిన వ్యక్తి కడారి సత్యనారాయణరెడ్డి లాంటి విప్లవ వీరుల హోమాన్ని ఆపాలి అని భరత్ బచావో అధ్యక్షులు తెలంగాణ సిద్ధాంత కర్త,ఉద్యమకారుడు గాదె ఇన్నయ్య ఘాటుగా హెచ్చరించారు.ముందుగా కడారి సత్యనారాయణ రెడ్డి పార్థివ దేహానికి నివాళులు అర్పించిన అనంతరం మీడియతో మాట్లాడారు. ప్రధాని మోడీ,అమిత్ షా బిజెపి కేంద్ర ప్రభుత్వ పై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆదివాసులకు కోసం అంబేద్కర్ రాజ్యాంగంలో 5వ షెడ్యూల్ అమలు కోసం కడారి సత్యనారాయణ రెడ్డి ఉద్యమించాడన్నారు.నరహంతక గ్రేహౌండ్స్ బలగాలను వాడి పచ్చటి అడవుల్లో రక్తపుటేరులు పారిస్తున్నా డన్నారు.ఆపరేషన్ కాగర్‌తో ఇప్పటికే 800 మందిని పొట్టన పెట్టుకున్నారని అమిత్షా పై ఆగ్రహం వ్యక్తం చేశారు.కడారి సత్యనారాయణ రెడ్డిని పట్టుకొని 24గంటలు చిత్రహింసలు పెట్టిఅతి దారుణంగా చంపారని ఆరోపించారు.కడారి సత్యనారాయణ రెడ్డిని కావాలనే హతమార్చారన్నారు కోసా దాదా మరణంతో దేశంలో ఓ సూర్య కిరణం అస్తమించిందని, హత్యాలతో ఉద్యమాన్ని ఆపలేరన్నారు. అస్తమించిన ఐటిఐ సత్తన్న దేశానికి వెలుగునిస్తాడన్నారు. నరమేధం సృష్టిస్తున్న ఆపరేషన్ కాగర్ ను వెంటనే ఆపాలని ఆయన డిమాండ్ చేశారు.

**విప్లవ గీతాలతో మార్మోగిన గోపాల్ రావు పల్లె**

విప్లవ వీరుడు కడారి సత్యనారాయణరెడ్డి,మృతితో అంతిమ యాత్రలో వివిధ ప్రజా సంఘాల నాయకులు,కవులు,రచయితలు, కళాకారులు పాల్గొన్నారు.పార్థివ దేహం వద్ద కళాకారులు పాడిన విప్లవ గీతాలతో గోపాల్‌రావు పల్లి హోరెత్తింది. అంత్యక్రియలు మొదలైన నుండి చివరి మజిలీ వరకు ఆద్యాంతం విప్ల జోహార్లు అర్పిస్తూ కళాకారులు గీతాలు ఆలపించారు.వారి గీతాలు అందరిని కంట తడి పెట్టించాయి. మావోయిస్టు నేత కడారి సత్యనారాయణరెడ్డి పార్థివ దేహానికి పలువురు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.ఇటీవల జరిగిన మరో ఎన్కౌంటర్లో మృతి చెందిన మావోయిస్టు కేంద్ర కమిటీ సభ్యులు గాజర్ల రవి సోదరుడు మాజీ మావోయిస్టు నేత



ప్రస్తుత పిసిసి అధికార ప్రతినిధి గాజర్ల అశోక్ కటారి సత్యనారాయణరెడ్డి కుటుంబ సభ్యులతో మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకుని వారి కుటుంబాన్ని ఓదార్చారు.

**అంతిమ యాత్రలో పాల్గొన్న కడారి సత్యనారాయణ రెడ్డి**

అంతిమ యాత్రలో బిఆర్ఎస్ పార్టీ మాజీ ఎమ్మెల్సీ దేవిప్రసాద్,ఏజీపీ పసుల కృష్ణ, సీనియర్ జర్నలిస్ట్ బండారి,బాల్రెడ్డి,దళిత లిబరేషన్ ఫ్రంట్ నాయకులు మార్వాడి సుదర్శన్ , కాంగ్రెస్ బిఆర్ఎస్,బిఎస్,పి,దళిత సంఘాల నాయకులు,అమరుల బంధుమిత్రుల సంఘం అధ్యక్షురాలు పద్మక్క,పౌర హక్కుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు లక్ష్మణ్,విరసం నేత పాణి , తెలంగాణ రచయితల వేదిక రాష్ట్ర నాయకులు జూగంటి జగన్నాథం, మానేరు రచయితల సంఘం ప్రతినిధి లక్ష్మణ్,వివిధ సంఘాల ప్రతినిధులు వివిధ కుల సంఘాల ప్రతినిధులు పెద్ద ఎత్తున పాల్గొని కోసా దాదాకు ఘనంగా నివాళులర్పించారు.

**అడుగడుగున పోలీసులే**

కడారి సత్యనారాయణరెడ్డి అంతిమయాత్రలో ఎక్కడ చూసినా మఫ్టిలో ఉన్న పోలీసులే కనిపించారు, అంతిమయాత్ర మొదలైన నుండి పూర్తయ్యే వరకు పోలీసులు వీడియో చిత్రీకరిస్తూ కనిపించారు.కడారి సత్యనారాయణరెడ్డి దేహానికి అంత్యక్రియలు నిర్వహించిన ఆయన సోదరుడు.చివరి సారిగా కడారి సత్యనారాయణ రెడ్డి మృతదేహానికి వాళ్ల అన్న కరుణాకర్ రెడ్డి చితికి నిప్పంటించి కన్నీటి పర్యంతమయ్యారు.

# కంచె చేను మేస్తుంది...బీజేపీ ప్రభుత్వ తీరు..

**-కోస మృతికి ఘన నివాళి : ప్రవీణ్ జె టోనీ**



**చురకలు ప్రతినిధి ఎల్లారెడ్డి పేట సెప్టెంబర్ 25 :** గత మూడు రోజుల క్రితం చత్తీస్గడ్ రాష్ట్రంలోని నారాయణ పూర్ జిల్లా అబుజ్గడ్ అడవుల్లో జరిగిన బిజెపి ఎన్కౌంటర్లో మరణించిన రాజన్న సిరిసిల్ల జిల్లా తంగళ్ళపల్లి మండలం గోపాలరావు పల్లె గ్రామానికి చెందిన కేంద్ర కమిటీ సభ్యుడు కామ్రేడ్ కోస అలియాస్ కడారి సత్యనారాయణ రెడ్డి గారి మృతదేహాన్ని ఆయన గ్రామంలో సందర్శించి భౌతిక కాయానికి తంగళ్ళపల్లి మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా నివాళు లర్పించడం జరిగింది.బడుగు బలహీన వర్గాల కోసం, కార్మికులకు అండగా, ఆదివాసుల తెగల అభ్యున్నతికి పేత్తందారీ వ్యవస్థ పైన పోరాటం కోసం కన్నవారిని ఉన్న ఊరిని విడిచిపెట్టి గత నలభై ఐదు సంవత్సరాలుగా అలుపెరుగని పోరాటం చేసిన నాయకుడిగా కామ్రేడ్ కోస మృతి తీరని లోటు గత రెండు సంవత్సరాల నుండి ఆపరేషన్ కగారి పేరుతో కేంద్రంలో ఉన్న బిజెపి ప్రభుత్వం కంచే చేను మేస్తున్న తీరుగా ప్రవర్తిస్తుంది.దేశానికి ముప్పు గా ఉన్న టెర్రరిస్టులను విడిచి పెట్టీ దేశ పౌరులైన వారిని పేదలకు అండగా ఉన్న వారిని, కార్పొరేట్ విదానానికి వ్యతిరేకంగా పోరాటం చేసిన వారిని హతమార్చడం బాధాకరం.నివాళులు అర్పించిన వారిలో మండల కాంగ్రెస్ అధ్యక్షులు ప్రవీణ్ టోనీ, మార్కెట్ కమిటీ వైస్ ప్రెసిడెంట్ నేరల్ల నరసింగం, డైరెక్టర్లు కళ్లేపల్లి తిరుపతి రెడ్డి,ఆరేపల్లి బాలు, నాయకులు లింగాల భూపతి, భైరనేని రాము, మునిగిల రాజు, సుద్దాల శ్రీనివాసు, చెన్నమనేని ప్రశాంత్, కడారి సునీల్ రెడ్డి, మిరల శ్రీనివాస్ వేల్పుల సాయిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## నూతన నియామక పత్రం



**చురకలు విలేఖరి,తిమ్మాపూర్ సెప్టెంబర్ 25 :** కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలం అలుగునూర్ ఎనిమిదోవ డివిజన్ కు చెందిన తాటిపల్లి జంపన్న ను తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ టీపీసీసీ సాంస్కృతిక సేన రాష్ట్ర అధ్యక్షులు చక్రాల రఘు ఆధ్వర్యంలో కరీంనగర్ జిల్లా కోశాధికారిగా,మానకొండూరు నియోజకవర్గం ఇన్చార్జిగా నియమించారు.మానకొండూరు నియోజకవర్గం శాసనసభ్యులు డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ గారు డిసిసి అధ్యక్షులు కరీంనగర్,మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ గారికి శాలువతో సత్కరించి ఆయన చేతుల మీదిగా నియామకపాత్రాన్ని తీసుకోవడం జరిగింది.మానకొండూరు ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ గారికి నా హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేస్తున్నాను.ఈ సందర్భంగా తాటిపల్లి జంపన్న మాట్లాడుతూ నాపైన నమ్మకంతో ఈ పదవిని అప్పగించిన నన్ను నియమించినందుకు రాష్ట్ర అధ్యక్షులు చక్రాల రఘు,జిల్లా అధ్యక్షులు గోనెల సమ్మన్న కి కృతజ్ఞతలు ధన్యవాదాలు తెలియజేస్తున్నాను.ఈ కార్యక్రమంలో కరీంనగర్ జిల్లా అధ్యక్షులు గోనెల సమ్మన్న, బోనగిరి తిరుపతి, పొట్టాల శివ కుమార్, కొరివి అరుణ్ కుమార్ సముద్రాల లక్ష్మణ్, కనకం విద్యాసాగర్ భీమ్ ఆర్మీ చీఫ్ శ్రీనివాస్ రావణ్, రెడ్డి గాని రాజు తదితరులు పాల్గొనడం జరిగింది.

## ఆది వరహాస్వామి హుండీ ఆదాయం 7,61,764



**చురకలు ప్రతినిధి కమాన్‌పూర్ సెప్టెంబర్ 25 :** కమాన్‌పూర్ మండల కేంద్రంలోని శ్రీ ఆదివార స్వామి హుండీ ఆదాయం 7,61,764 రూపాయలు వచ్చింది. గురువారం హుండీ లెక్కింపు శ్రీ ఆది వరాహస్వామి కల్యాణ మండపంలో జరుపగా ఈ ఆదాయం వచ్చింది. ఇందులో ఉగాది పర్వదినము మరియు శ్రీ జయంతి ఉత్సవాల సందర్భంగా భక్తులు ఈ కానుకలను వేశారు. దేవాదాయ పరిశీలకులు పి సత్యనారాయణ, ఆలయ ఈవో కాంతారెడ్డి ఆధ్వర్యంలో హుండీ లెక్కింపు జరిగింది.లెక్కింపులో శ్రీ లక్ష్మీనరసింహ స్వామి సేవా ట్రస్ట్ కార్యదర్శి ప్రేమలత మరియు సభ్యుల ఆధ్వర్యంలో జరిగింది. పోలీసు సిబ్బంది మల్లయ్య మరియు శంకర్ లో పహారా నిర్వహించారు.ఈ కార్యక్రమంలో కల్వల సంతు మల్లేష్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## దుర్గాదేవికి జిఎం దంపతుల ప్రత్యేక పూజలు



**చురకలు ప్రతినిధి కమాన్ పూర్ సెప్టెంబర్ 25 :** రామగుండం ఏరియా జీడికే-2 ఇంక్లైన్ బొగ్గు గని వద్ద ప్రతిష్టించిన దుర్గాదేవి అమ్మవారి కి గురువారం సాయంత్రం సింగరేణి జిఎం డి లలిత్ కుమార్ దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. సింగరేణి బొగ్గు పరిశ్రమలో పనిచేసే కార్మికులు కార్మిక కుటుంబాలు అంత కూడా సంపూర్ణ ఆయురారోగ్యాలతో, సుఖ సంతోషాలతో వర్ధిల్లాలని కోరుతూ అమ్మవారికి పూజలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో రామగుండం ఎమ్మెల్యే సతీమణి మనాలి ఠాకూర్, సింగరేణి సేవా సమితి అధ్యక్షురాలు అనిత లలిత్ కుమార్, అధికారులు రమేష్, రమేష్ బాబు,షేక్ అల్లాద్దీన్, జాన్సన్ తోపాటు వివిధ విభాగాలకు చెందిన సింగరేణి అధికారులు పాల్గొన్నారు. అనంతరం బొగ్గు గని వద్ద అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

# రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ ప్రపంచంలోనే అతిపెద్ద స్వచ్ఛంద సంస్థ

**చురకలు విలేఖరి,తిమ్మాపూర్ సెప్టెంబర్ 25 :** పరమ పూజనీయ డా. కేశవరామ్ బలీరామ్ హెడ్గేవార్ 1925లో మహారాష్ట్రలోని నాగపూర్ లో కేవలం పది మందితో ప్రారంభించిన రాష్ట్రీయ స్వయంసేవ సంఘ్ నేడు ప్రపంచంలోనే అతిపెద్ద స్వచ్ఛంద సంస్థగా ఆవిర్భవించిందని ఆర్ఎస్ఎస్ జిల్లా కార్యవాహ గుత్తికొండ రాజశేఖర్ జి అన్నారు.గురువారం రోజున తిమ్మాపూర్ ఖండ పర్లపల్లిలో ఆర్ఎస్ఎస్ విజయదశమి ఉత్సవం జరిగింది.ఇట్టి సమావేశానికి ముఖ్య వక్తగా హాజరైన ఆయన మాట్లాడుతూ 1925 నుండి 2025 ఏళ్ల ఆర్ఎస్ఎస్



ప్రస్థానం పూర్తిగా దేశసేవకోసమే కొనసాగిందన్నారు.భారతీయ చరిత్ర , సంస్కృతి, సాంప్రదాయాలను రక్షించడానికి,దేశ పరం వైభవ స్థితి కోసం ఆర్ఎస్ఎస్ వందేళ్లగా పనిచేస్తుందన్నారు.దేశంలో ఏ ప్రకృతి విపత్తులు,అనుకోని ప్రమాదాలు సంభవించిన ముందుకు వచ్చి ప్రజలకు సేవ చేసిన ఏకైక సంస్థ ఆర్ఎస్ఎస్ యే అన్నారు.ప్రస్తుతం ఆర్ఎస్ఎస్ శతాబ్ది ఉత్సవాల్లో భాగంగా పంచ పరివర్తన్ దిశలో సంఘం ప్రయాణాన్ని మొదలుపెట్టిందన్నారు.అందులో భాగంగా కుటుంబ ప్రబోధన్, పర్యావరణం, సామాజిక సమరత, స్వదేశీ , పౌర నియమాలు /బాధ్యతలు అనే అంశాలతో ముందు కొనసాగుతుందన్నారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన టీ జి బి పర్లపల్లి శాఖ మేనేజర్ గుగులోతు తిరుపతి మాట్లాడారు.ఈ కార్యక్రమంలో తిమ్మాపూర్ ఖండ కార్యవాహ ఆవుల కుమార్ జి,ఆర్ఎస్ఎస్ బాధ్యులు నర్సింగ్ జి,పర్లపల్లి ఉపఖండ ప్రముక్ బుడిగే రమేష్జి పాల్గొన్నారు.

# దుర్గాదేవికి ప్రత్యేక పూజలు

**చురకలు విలేకరి, కోరుట్ల, సెప్టెంబర్ 25 :** కొలిచే భక్తులకు కొంగుబంగారంగా నిలిచే కోరుట్ల త్రిశక్తి మాత ఆలయలో గణేశ నవదుర్గా మండలి సేవా సమితి ఆధ్వర్యంలో అమ్మవారి ఆలయానికి గురువారం భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చి ప్రత్యేక పూజలు,అభిషేకాలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు.త్రిశక్తి ఆలయంలో గణేశ నవదుర్గా మండలి సేవా సమితి ఆధ్వర్యంలో త్రిశక్తి ఆలయంలో దుర్గాశరన్నవ రాత్రి ఉత్సవాల సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు,పూజలు, కుంకు



మార్చనలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గణేశ నవదుర్గా మండలి త్రిశక్తి ఆలయ సేవా సమితి అధ్యక్షులు కటుకం గణేష్, ప్రధాన కార్యదర్శి వద్దకొండ శ్రీనివాస్ మాట్లాడుతూ త్రిశక్తి మాత ఆలయంలో దుర్గాదేవి శరన్నవరాత్రి ఉత్సవాలలో భాగంగా ప్రతి రోజు అమ్మవారికి భారీ సంఖ్యలో మహిళలు మంగళహారతులతో తరలివచ్చి కుంకుమార్చనలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. చండీ హవనం, శుక్రవారం బోనాల పండుగ,శనివారం లక్ష గాజుల అర్చన, సోమవారం సరస్వతిపూజ, సామూహిక అక్షరాభ్యాసం,మంగళ వారం దుర్గాష్టమి చండి హవనం నిర్వహించిన అనంతరం అన్నదానం ఉంటుందని తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని త్రిశక్తి అమ్మవారి కృపకు పాత్రులు కావాలని గణేష్, శ్రీనివాస్ కోరారు.ఈ కార్యక్రమంలో ఆలయ సేవా సమితి అధ్యక్షులు కటుకు గణేష్, ఉపాధ్యక్షులు ఎలిగేటి సుమన్, ప్రధాన కార్యదర్శి వడ్లకొండ శ్రీనివాస్,సహాయ కార్యదర్శి మామిడిపల్లి రమేష్,కోశాధికారి అడువాల ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

## శాకాంబరీ అలంకరణలో అమ్మవారు



**చురకలు విలేకరి, ధర్మపురి, సెప్టెంబర్ 25 :** ధర్మపురి మండలంలోని తిమ్మాపూర్ గ్రామంలో దసరా శరన్నవరాత్రులు అత్యంత వైభవంగా జరుగుతున్నాయి. తిమ్మాపూర్ లో ఏర్పాటు చేసిన దుర్గమ్మ మండపంలో గురువారం అమ్మవారికి శాకంబరీ అలంకరణ చేశారు. జనంతరం మహిళలచే సామూహిక కుంకుమార్చన తదితర ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామంలోని మహిళలు కుంకుమార్చన అమ్మవారి పూజల్లో పాల్గొని పూజలు చేశారు.

## ఆలయ అర్చకులకు దీక్ష వస్త్రాలు



**చురకలు విలేకరి, ధర్మపురి, సెప్టెంబర్ 25 :** ధర్మపురి క్షేత్రంలో జరిగే దసరా నవరాత్రోత్సవాలు పురస్కరించుకొని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కామెన రాం సుధాకర్ రావు స్థానిక లక్ష్మీ నరసింహస్వామి దేవాలయ వేద పండితులు, అర్చకులకు దీక్ష వస్త్రాలను గురువారం అందజేశారు. ఈ సందర్భంగా రాంసుధాకర్ రావును ఆలయ వేద ధర్మకర్తల మండలి చైర్మన్ జక్కు రవీందర్ స్వామి శేష వస్త్రంతో ఘనంగా సత్కరించారు.

## మద్యం దుకాణాలకు రిజర్వేషన్లు ఖరారు



### -నేడు నోటిఫికేషన్ విడుదల

**చురకలు ప్రతినిధి కరీంనగర్, సెప్టెంబర్ 25 :** జిల్లాలో మద్యం దుకాణాల నిర్వహణకు రిజర్వేషన్లు ఖరారైనట్లు ఎక్సైజ్ సూపరింటెండెంట్ పి.శ్రీనివాస్ రావు తెలిపారు. గురువారం జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి ఆధ్వర్యంలో రిజర్వేషన్ల ఖరారు ప్రక్రియ పూర్తయింది.జిల్లాలో మొత్తం 94 మద్యం దుకాణాలకు గాను 17 దుకాణాలు గీత కార్మికులకు, 9 మద్యం దుకాణాలు ఎస్సీ కేటగిరీకి రిజర్వ్ చేశారు. 94 దుకాణాల్లో ఏయే దుకాణాలు గీత కార్మికులకు, ఎస్సీలకు రిజర్వ్ చేయాలో డ్రా పద్ధతి ద్వారా ఎంపిక చేశారు.జిల్లాలో మద్యం దుకాణాల నిర్వహణదారుల ప్రస్తుత కాలపరిమితి ఈ ఏడాది నవంబర్ 30 న ముగియనంది. డిసెంబరు 1, 2025 నూతన టెండర్ల దారులను ఖరారు చేసేందుకు శుక్రవారం నోటిఫికేషన్ విడుదల చేయనున్నారు. ఈ నేపథ్యంలో గురువారం రిజర్వేషన్ ప్రక్రియ పూర్తి చేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ పి.శ్రీనివాసరావు, బీసీ సంక్షేమ అధికారి అనిల్ ప్రకాష్, ఎస్సీ సంక్షేమ శాఖ డిడి నాగలేశ్వర్, సిఐలు జి.రాము ఎస్.అశోక్, ఎస్.బాబా, ఎస్ఐలు మహమ్మద్ ఇషాఖ్ పాషా, విజయ్ ఎక్సైజ్ సిబ్బంది అనిల్, సాయి కృష్ణ పాల్గొన్నారు.



## జిల్లా పశువైద్య,సంవర్ధక అధికారికి శుభాకాంక్షల వెల్లువ



**చురకలు విలేకరి, జగిత్యాల, సెప్టెంబర్ 25 :** జగిత్యాల జిల్లా పశు వైద్య మరియు పశు సంవర్ధక శాఖ అధికారిగా పదోన్నతిపై జిల్లాకు బదిలీపై వచ్చిన డా.బి.ప్రకాష్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా టిఎనివోల అధ్యక్షుడు మిర్యాల నాగేందర్ రెడ్డి ఆధ్వర్యంలో ఉద్యోగులు మర్యాదపూర్వకంగా ఆయనను కలిసి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం జిల్లా పశువైద్యాధికారిగా పని చేసి రిలీవ్ అయిన డా.కె.వేణుగోపాల్ రావును టిఎన్జివోలు సన్మానించారు. ఈ కార్యక్రమంలో టీఎన్జీనిఏ జిల్లా అధ్యక్షులు ఆనంద్, కార్యదర్శి గణేష్, నాయకులు రవీందర్, శైలజ, రాజ్ కుమార్, పూర్ణచందర్, రాజేష్, వెంకటరమణ, రవి, శైలజ, రవీందర్, సంతోష్, నాగరాజు, రాజేందర్, రాజయ్య, శ్రీనివాస్, నాగరాజు, కుమారస్వామి, ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

## పలు కేసుల్లో నిందితునికి జైలుశిక్ష

**చురకలు విలేకరి, మెట్ పల్లి, సెప్టెంబర్ 25 :** మహిళలను లైగింకంగా, శారీరకంగా వేధిస్తూ, వారి కుటుంబసభ్యుల అసభ్యంగా ప్రవర్తించి ఓ మహిళ ఆత్మహత్యకు కారుకుడైన మహమ్మద్ రహీం అనే వ్యక్తికి ఒ కేసులో రెండేళ్ల జైలుశిక్ష, రూ.2 వేల జరిమానా, మరో కేసులో ఐదేళ్ల జైలుశిక్ష, రూ.2వేల జరిమానా విధిస్తూ న్యాయమూర్తి డి.నాగేశ్వర్రావు గురువారం తీర్పు వెలువరించారు.మెట్పల్లి పోలీస్ స్టేషన్ పరిధికి చెందిన ఓ మహిళను రహీం తరుచుగా వెంబడిస్తూ లైగింకంగా వేధించడాని, ఆమెను, ఆమె కుటుంబసభ్యుల పట్ల అసభ్యంగా ప్రవర్తించడంతో సదరు మహిళ 2018 ఫిబ్రవరి 1న మెట్పల్లి పోలీసులకు ఫిర్యాదు.చేసింది. అప్పటి ఎస్ఐ శంకర్రావు కేసు నమోదు చేసి కోర్టులో చార్జ్ షీటు దాఖలు చేశారు. ఈ కేసులో నిందితునికి రెండేళ్ల జైలుశిక్ష, రూ.2 వేల జరిమానా విధిస్తూ న్యాయమూర్తి డి.నాగేశ్వర్రావు తీర్పు వెలువరించారు. నిందితుడు రహీం మరో మహిళను శారీరకంగా, మానసికంగా వేధించడంతో సదరు మహిళ రహీం వేధింపులు భరించలేక అవమానభారంతో 2019 మార్చి 25న ఇంట్లో ఎవరు లేని సమయంలో ఓంటిపై కిరోసిన్ పోసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. ఈ కేసులో నిందితుడైన రహీంకు ఐదేళ్ల జైలుశిక్ష, రూ.2 వేల జరిమానా విధిస్తూ న్యాయమూర్తి డి.నాగేశ్వర్రావు తీర్పు వెలువరించారు. కేసుల్లో నిందితునికి జైలుశిక్ష పడటంలో కృషి చేసిన విచారణాధికారి శంకర్ రావు, పిపి ఆనంద్ గౌడ్, సిఎంఎస్ ఎస్ఐ శ్రీకాంత్, కోర్టు కానిస్టేబుల్ వినోద్లను జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ అభినందించారు.

## విద్యుత్‌శాఖ ఆధ్వర్యంలో బతుకమ్మ సంబరాలు



**చురకలు విలేకరి, జగిత్యాల, సెప్టెంబర్ 25 :** టీజీ ఎనపిడిసిఎల్ సంస్థ జగిత్యాల సర్కిల్ ఆధ్వర్యంలో గురువారం పద్మనాయక కల్యాణ మండపంలో బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా జిల్లా అదనపు కలెక్టర్ బిఎస్ లత, విద్యుత్ శాఖ సూపరింటెండెంట్ ఇంజనీర్ సుదర్శనంలు హజరయ్యారు. ఈ సందర్భంగా విద్యుత్ సంస్థలో పని చేస్తున్న మహిళలు పాటలు పాడుతూ, దండియా ఆడుతూ బతుకమ్మ సంబరాలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఏవో తిరుపతయ్య, డీఈలు గంగారాం, మధుసూదన్, ఏవో శ్రీనివాస్, విద్యుత్ శాఖ ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

## మాజీ ఎమ్మెల్యే పరామర్శ



**చురకలు విలేకరి, కోరుట్ల, సెప్టెంబర్ 25 :** కోరుట్ల మండలంలోని కల్లూరు గ్రామానికి చెందిన చిట్నేని యశోదమ్మ ఇటీవలే మృతి చెందగా వారి కుటుంబాన్ని గురువారం జిల్లా బిఆర్ఎస్ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్ రావు సరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆయన వెంట మాజీ సర్పంచ్ వనతడుపుల అంజయ్య, నాయకులు సిహెచ్ శైలజ జగన్ రావు, గంగాపోచాలు, పుల్లూరు నర్సయ్య తదితరులున్నారు.

# కాంగ్రెస్ పార్టీ ఆదివాసి శిక్షణ శిబిరాలు ప్రారంభం

## -ఉమ్మడి కరీంనగర్ జిల్లా స్థాయి కాంగ్రెస్ పార్టీ ఆదివాసి శిక్షణ ప్రారంభించిన రాష్ట్ర మంత్రులు పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్ కుమార్



**చురకలు ప్రతినిధి కరీంనగర్, సెప్టెంబర్ 25 :** కరీంనగర్ డీసీసీ కార్యాలయంలో రాష్ట్ర ఆదివాసి కార్పొరేషన్ చైర్మన్ డా. బెల్లయ్య నాయక్ ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు జరిగే ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఆదివాసీ కాంగ్రెస్ కార్యకర్తల సమ్మేళన శిక్షణ కార్యక్రమాలను రాష్ట్ర రవాణా బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, రాష్ట్ర గిరిజన మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రివర్యులు అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ప్రారంభించడం జరిగింది.మొదట గిరిజన సంక్షేమ శాఖ మంత్రివర్యులు అడ్లూరి లక్ష్మణ్ కుమార్ రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ గారితో కలిసి మొదట డిసిసి కార్యాలయంలో పార్టీ పతాకాన్ని ఆవిష్కరించడం జరిగింది.అనంతరం వేదికపై సేవలాల్ మహారాజ్, అంబేద్కర్ చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులు అర్పించి ఆదివాసీ కాంగ్రెస్ కార్యకర్తల శిక్షణ తరగతులను మంత్రులు ప్రారంభించడం జరిగింది.ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. కరీంనగర్ జిల్లా ఆదివాసి కాంగ్రెస్ కార్యకర్తలకు జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో 3 రోజుల పాటు జరిగే శిక్షణ తరగతులు ప్రారంభించుకున్నందుకు స్వాగతం..ఎస్టీ కార్పొరేషన్ చైర్మన్ బెల్లయ్య నాయక్ ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ శిక్షణ కార్యక్రమంలో ప్రభుత్వం సంక్షేమం, అభివృద్ధి బలహీన వర్గాలకు సంబంధించిన అంశాలు కాంగ్రెస్ చర్చించాలి. కాంగ్రెస్ పార్టీ సామాజిక న్యాయానికి ఛాంపియన్.. కాంగ్రెస్పార్టీలో మాత్రమే సామాజిక న్యాయం జరుగుతుంది. కాంగ్రెస్ ప్రభుత్వంలో మాత్రమే బలహీన వర్గాల అభివృద్ధి జరిగింది. మన నాయకులు జవహర్ లాల్ నెహ్రూ,ఇందిరా గాంధీ,రాజీవ్ గాంధీ నిర్ణయం తీసుకున్న సంబంధించిన అంశాలు లేకుండా నిర్ణయాలు ఉండకపోయేది.ఈ శిక్షణ ద్వారా భవిష్యత్ మార్గ నిర్దేశం చేసుకోవాలి. ఇటీవల ఉస్మానియా యూనివర్సిటీలో ముఖ్యమంత్రి రేవంత్రెడ్డి మాట్లాడుతూ గతంలో ప్రభుత్వం వద్ద పేదలకు పంచడానికి భూములు, డబ్బులు ఉండేవి.కానీ ఇప్పుడు ప్రభుత్వం అందించేది విద్య మాత్రమే.విద్య రేపటి భవిష్యత్ సమాజానికి పునాదులు వేస్తుంది అని తెలిపారు.గిరిజన శిక్షణ కార్యక్రమంలో కూడా ఈ విద్యా అంశాన్ని ప్రధానంగా చర్చించాలి. చదువుకుంటేనే ఆ సమాజం ఆ కుటుంబం బాగుపడుతుంది.మన గిరిజన కుటుంబాలు చదువుకుంటే ఆ ఇంటికి దీపం వెలుగుతుంది అని అన్నారు.ఎస్సీ ఎస్టీ మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రివర్యులు అడ్లూరి లక్ష్మణ్ కుమార్ గారు మాట్లాడుతూ..నాడు ఈ దేశంలో ఆదివాసీలకు గిరిజనులకు బలహీన వర్గాలకు అండగా ఉన్నది ఇందిరాగాంధీ నాటి నుండి సోనియా గాంధీ గారు, రాహుల్ గాంధీ గారు, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారు భట్టి విక్రమార్క గారు గిరిజనులకు అండగా ఉన్నారు.పోరాట యోధులు ఆదివాసుల అభివృద్ధి కోసం వారి జీవితంలో వెలుగులు నింపడం కోసం నిర్వహించే ఈ శిక్షణ శిబిరాలకు ఉమ్మడి కరీంనగర్ జిల్లా మంత్రులు ఎమ్మెల్యేలు హాజరవుతారు.ఈ శాఖ మంత్రిగా మీరు ఏ సూచనలు చేసినా మీరు చెప్పిన అభిప్రాయాలను తీసుకొని 33 జిల్లాలకు సంబంధించిన ఆదివాసీలు సమస్యలపై ప్రభుత్వ నిబంధనలు అనుగుణంగా మీకందరికీ మేలు జరిగే విధంగా కార్యక్రమాలు చేసుకుంటాము. మొదటిసారి ఈ రాష్ట్ర ప్రభుత్వం ట్రైబల్ అడ్వైజర్ కమిటీ బోర్డు మీటింగ్ ఏర్పాటు చేయడం జరిగింది, వెనుకబడిన తండాలు గ్రామాలలో సరైన రోడ్లు బ్రిడ్జి నిర్మాణాలు ఏర్పాటు చేసే బాధ్యత నాది అని హామీ ఇస్తున్నాను అన్నారు.గత ప్రభుత్వంలో ట్రైబల్ కమిషన్ కమిటీ వేయలేదు, మన ప్రభుత్వం ఏర్పడిన తర్వాత అడ్వైజర్ కమిటీ లో అన్ని పార్టీల ఎమ్మెల్యేలు ఉంటారు, కాంగ్రెస్ పార్టీ ఆ విధంగా గిరిజనుల అభివృద్ధికి ఎంతగానో కట్టుబడి ఉంది అని అన్నారు.

# గ్రామాల అభివృద్ధికి కృషి : రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి



**చురకలు విలేకరి, ధర్మపురి, సెప్టెంబర్ 25 :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం గ్రామాల అభివృద్ధికి ప్రత్యేక కృషి చేస్తుందని రాష్ట్ర ఎస్సి,ఎస్టి,మైనార్టీ వికలాంగుల సంక్షేమ శాఖ అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. గురువారం ధర్మపురి మండలం రాయపట్నం, దొనూర్ గ్రామాల్లో పలు అభివృద్ధి పనులకు, భూమి పూజ చేసి పలు అభివృద్ధి పనులు ప్రారంభించారు. గ్రామంలో 12 రాయపట్నం లక్షల వ్యయంతో నిర్మించబోయే అంగన్వాడీ భవన నిర్మాణ పనులకు గ 5 లక్షల వ్యయంతో చేపట్టిన అంబేద్కర్ సంఘ భవన మిగులు పనులకు కూడా శంకుస్థాపన చేశారు. గ్రామంలో 1.5 లక్షల వ్యయంతో ఎలక్ట్రిక్ లైట్లను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. అనంతరం ధర్మపురి మండలం దొనూర్ గ్రామంలో 16 లక్షల వ్యయంతో నిర్మించిన నూతన గ్రామ పంచాయతీ భవనాన్ని రాష్ట్ర సంక్షేమశాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ప్రారంభించారు. 10 లక్షల వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపనలు చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించడమే లక్ష్యంగా ప్రభుత్వం కృషి చేస్తోందని, ప్రతి ఇంటికీ అభివృద్ధి ఫలాలు చేరేలా చర్యలు తీసుకుంటామని మంత్రి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ చిలుముల లావణ్య లక్ష్మణ్, వైస్ చైర్మన్ సంగా నర్సింహులు, మండల కాంగ్రెస్ నాయకులు కుంట సుధాకర్, రందేని మోగిలి, దాసరి పురుషోత్తం, తదితరులు పాల్గొన్నారు

### హుజురాబాద్ జమ్మికుంట

# మున్సిపాలిటీలకు.. రూ.30 కోట్లు మంజూరు

## -కౌశిక్, ప్రణవ్ చిత్రపటాలకు పాలాభిషేకాలు



**చురకలు ప్రతినిధి హుజురాబాద్ సెప్టెంబర్ 25 :** హుజురాబాద్ జమ్మికుంట మున్సిపాలిటీల పరిధిలో అభివృద్ధి కార్యక్రమాలకోసం రూ.30 కోట్లు మంజూరు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నిధుల ద్వారా పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టనున్నారు. అయితే.. ఈ నిధులను ఎమ్మెల్యే పార్టీ కౌశిక్ రెడ్డి అసెంబ్లీలో చేసిన విజ్ఞప్తి మేరకు ప్రభుత్వం మంజూరు చేసిందని చెప్తూ.. గురువారం స్థానిక బి ఆర్ ఎస్ నాయకులు కార్యకర్తలు అంబేద్కర్ కూడలిలో పాడి కౌశిక్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఇదిలా ఉంటే నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి వొడి తల ప్రణవ్ విజ్ఞప్తి మేరకు సీఎం రేవంత్ రెడ్డి నిధులు మంజూరు చేశారని పేర్కొంటూ స్థానిక కాంగ్రెస్ నాయకులు ప్రణవ్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఎవరికివారు పోటాపోటీగా వారి నేతల చిత్రపటాలకు పాలాభిషేకం చేయడం చర్చనీయాంశం అయింది.

### మానేరు ఆనకట్టపై స్వచ్ఛతాహి సేవ

# కార్యక్రమంలో మంత్రి పొన్నం



**చురకలు ప్రతినిధి కరీంనగర్ సెప్టెంబర్ 25 :** స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో లోయర్ మానేరు ఆనకట్టపై " ఏక్ దిన్ ఏక్ గంట ఏక్ సాత్"నివాదంతో పరిశుభ్రత పనుల కార్యక్రమం (శ్రమదానం) నిర్వహించారు.రాష్ట్ర రోడ్డు రవాణా, బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి, జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి, అడిషనల్ కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే, నగరపాలక సంస్థ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్, డిఆర్ఓ వెంకటేశ్వర్లు, వివిధ శాఖల అధికారులు ఉద్యోగులు సిబ్బంది విద్యార్థులు పోలీసులు పెద్ద ఎత్తున ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.ఆనకట్టకు ఇరువైపులా గంటపాటు చీపురుతో శుభ్రం చేశారు. చెత్తను, ప్లాస్టిక్ వ్యర్థాలను సేకరించారు.

# కూష్మాండ రూపంలో అమ్మవారు



**చురకలు విలేకరి, ధర్మపురి, సెప్టెంబర్ 25 :** ప్రముఖ పుణ్యక్షేత్రం ధర్మపురిలోని శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి దేవస్థానములో,నవదుర్గ సేవ సమితి,మహాశక్తి సేవ సమితి ఆధ్వర్యంలో "దసరా నవరాత్రోత్సములు అత్యంత వైభవంగా జరుగుతున్నాయి. 4వ రోజు ప్రధాన దేవాలయముతో పాటు ఇతర అనుబంధ ఆలయాలలో కలశస్థాపనలు, విశ్వక్షేన పూజలు, దీపారాదనలు మొదలగు కార్యక్రమములు నిర్వహించారు. అనుబంధ దేవాలయమైన శ్రీరామలింగేశ్వరస్వామి వారి ఆలయము(శివాలయము)లో ఉదయము దసరా(దేవి) నవరాత్రుల ఉత్సవములలో భాగంగా 4వ రోజు ఉదయము వేదపండితులు, ఋత్వికులచే మహ సంకల్పము, పృద్వీకలశ, గణపతి పూజ, స్వస్తిఃపుణ్యాహ వచనము, ఋత్విక్ వర్ణణము, అఖండ దీప స్థాపన, నవగ్రహ, వాస్తు, క్షేత్ర పాలక, యోగిని, అంకురారోపణ, మాతృక, సర్వతోభద్ర మండల పూజలు జరిగినవి. ఇందులో భాగంగా సప్తశతీ పారాయణము, అమ్మ వారికి చతుషష్ఠి పూజ, శ్రీచక్రమునకు కుంకుమార్చన, హారతి, మంత్రపుష్పము, తీర్థప్రసాద వితరణలు జరిగినవి ఐదు(5)ఋత్వికులచే "చండీపారాయణం" & "దేవిభాగవత పారాయణం", కన్యకా, సువాసిని పూజలు నిర్వహించారు. గురువారం అమ్మ వారు "కూష్మాండ", "శాకాంబరి" రూపములలో గోదుమ రంగు చీరలో మల్లెపూలు, బిల్వపత్రి దండలు దరించి భక్తులకు దర్శనం ఇచ్చారు.ఈ కార్యక్రమములో దేవస్థాన అధ్యకులు జక్కు రవీందర్, ధర్మకర్తలు ఎదులాపురం మహేందర్, బాదినేని వెంకటేష్, బొల్లారపు పోచయ్య, గుడ్ల రవీందర్, కొమురెల్లి పవన్ కుమార్, మందుల మల్లేష్, నేదునూరి శ్రీధర్, రాపర్తి సాయికిరణ్,స్థంభంకాడి గణేష్, సంబెట తిరుపతి, వొజ్జల సౌజన్య , వేదపండితులు బొజ్జ రమేష్ శర్మ, పాలెపు ప్రవీణ్ శర్మ, సిహెచ్.ముత్యాల శర్మ, ఋత్వికులు భరత్ శర్మ, దుద్దిల్ల నారాయణ శర్మ, అలువాల కృష్ణ శర్మ, తాడూరి బలరాంశర్మ, పాలెపు చంద్రమౌళిశర్మ, సూపరింటెండెంట్ డి.కిరణ్, ఉపప్రధాన అర్చకులు నేరళ్ళ శ్రీనివాసాచార్యులు, ముఖ్య అర్చకులు నంబి శ్రీనివాసాచార్యులు, అర్చకులు ద్యావళ్ళ విశ్వనాథ శర్మ, అభిషేక పురహితులు బొజ్జ సంపత్ కుమార్, బొజ్జ రాజగోపాల్ శర్మ మరియు అర్చకులు, సిబ్బంది, ఋత్వికులు నంబి అరుణ్ కుమార్, పాలెపు సందీప్ శర్మ, ద్యావళ్ళ సాయి శర్మ మరియు భక్తులు పాల్గోన్నారు.